www.trinetnews.com

ట్రైనెట్ తెలంగాణ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి 01 సంచిక 95 ఎడిటర్ :వెంకటేశ్వర్లు రాపోలు శుక్రవారం నవంబర్ 06, 2026 పేజీలు:12 వెల.10/-

బాచుపల్లిలో భవనం పైనుంచి దూకి బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

హైదరాబాద్: నగరంలోని బాచుపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో భవనంపై నుంచి దూకి బీటెక్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. విద్యార్థిని క్షితిహాసన్ (20) నిజాంపేట్ హిల్ కౌంటీ ముసోరీ టవర్స్ 13వ అంతస్తు నుంచి కిందకు దూకింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. యువతి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. క్షితిహాసన్.. ముసోరి టవర్స్ పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌లో తన తల్లి, సోదరితో కలిసి ఉంటోంది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, విద్యార్థిని మృతికి కుటుంబసభ్యులే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

గ్లోబల్ సమిట్‌కు పర్యాటక శోభ!

– సమిట్‌లో తెలంగాణ టూరిస్ట్ స్పాట్ల ప్రదర్శన.

– ప్రతినిధులకు లైజనింగ్ ఆఫీసర్ల నియామకం.

- రిజిస్ట్రేషన్లు, పాస్‌ల ప్రక్రియ పూర్తి చేయాలి.
- వాతావరణ మార్పులపై ప్రత్యేక చర్చ.
- నర్సరీ నుంచి ఆక్స్‌ఫర్డ్ వరకు విద్యారంగంపై చర్చ.
- నవంబర్ 15లోగా ఏర్పాట్ల ప్రణాళిక సిద్ధం.
- ఇతర రాష్ట్రాల సీఎంలకు ఆహ్వానాలు.
- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో సమిట్.



హైదరాబాద్:

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్‌లో పాల్గొనే ప్రతినిధులకు లైజనింగ్ ఆఫీసర్లను నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రతినిధుల రిజిస్ట్రేషన్, పాస్‌ల ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ప్రముఖ టూరిస్ట్ స్పాట్లను సమిట్‌లో ప్రదర్శించాలన్నారు. వాతావరణ మార్పులపై సదస్సులో చర్చ జరిగేలా చూడాలని, నర్సరీ నుంచి ఆక్స్‌ఫర్డ్ వరకు తెలంగాణ ఎడ్యుకేషన్ ప్రతిబింబించేలా చర్చ జరగాలని దిశానిర్దేశం చేశారు. నవంబర్ 15 వరకు ఏర్పాట్ల ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ఇతర రాష్ట్రాల సీఎంలను ఆహ్వానించాలని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, గవర్నర్ కోటా ఎమ్మెల్సీల భర్తీపై చర్చించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో జరగనున్న సదస్సుపై సమాలోచనలు చేశారు.

పార్లమెంట్‌లో చర్చకు అమిత్‌షా సవాల్!



- రాహుల్ బహిరంగ చర్చ డిమాండ్‌పై అమిత్‌షా ఫైర్.
- వీధుల్లో కాదు.. పార్లమెంట్‌లో తేల్చుకుందామని సవాల్.
- ప్రభుత్వ సమాధానాలు తట్టుకోలేకే పారిపోతారంటూ ఎద్దేవా.
- పార్లమెంట్ కార్యకలాపాలను కాంగ్రెస్ అడ్డుకుంటోందని విమర్శ.
- కీలక చర్చలకు కాంగ్రెస్ దూరంగా ఉంటోందని ఆరోపణ.
- SIRపై ప్రత్యేక పార్లమెంట్ సమావేశానికి సిద్ధమని ప్రకటన.
- వీధుల్లో ఆందోళనలు కొనసాగిస్తే తగిన సమాధానం ఉంటుందని హెచ్చరిక.

2 లో

ప్రధాని మోదీ బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తోన్న డిమాండ్‌ను కేంద్ర హోంమంత్రి అమిత్ షా (ఎఐ వాష్అప్) తప్పుపట్టారు. రాజకీయ చర్చను వీధుల్లో కాకుండా పార్లమెంట్‌లో పెట్టాలని మంత్రి సవాల్ విసిరారు. ప్రభుత్వం నుంచి వచ్చే సమాధానాలను రాహుల్ తట్టుకోలేరని ఎద్దేవా చేశారు.

"బాధ్యతాయుతమైన చర్చ జరగాలని మీరు అనుకుంటే.. మీ ఆందోళనల్లో సత్యం, తర్కం ఉంటే.. రండి పార్లమెంట్‌లో చర్చించుకుందాం. ఎదురెదురుగా కూర్చొని మాట్లాడుకుందాం. కానీ, మా సమాధానాలను మీరు తట్టుకోలేరు. ఎప్పటిలాగే పారిపోతారు. పార్లమెంట్ కార్యకలాపాలకు అంతరాయం కలిగించడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకుంది. బాయ్‌కాట్‌లను రాజకీయ వ్యూహంగా మార్చుకుంది. పార్లమెంట్‌లో కీలకమైన చర్చలను తప్పించుకుంటూ..

మిగతాద్ది 2 లో

ఆర్ఆర్ ట్యాక్స్‌పై మోదీ, అమిత్‌షా చర్యలేవీ?: కేటీఆర్

- ఆర్ఆర్ ట్యాక్స్ వసూళ్లపై కేటీఆర్ నిలదీత.
- ఆరోపణలు చేస్తున్న మోదీ, అమిత్‌షా చర్యలేవని ప్రశ్న.
- చదరపు అడుగుకు రూ.200 వసూలు చేస్తున్నారని ఆరోపణ.
- హైదరాబాద్ బిల్డర్లకు ఈ వసూళ్లు తెలిసిన విషయమేనని వ్యాఖ్య.
- కాంగ్రెస్, బీజేపీ మధ్య అంతర్గత అవగాహన ఉందని ఆరోపణ.
- విమర్శలకే పరిమితమవుతున్నారంటూ కేంద్రంపై విమర్శ.


2 లో



పంజగుట్ట: స్పా ముసుగులో వ్యభిచార గృహం

హైదరాబాద్:

బ్యూటీ సెలూన్, స్పా ముసుగులో వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న వారిని పంజగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. ఒక బాధిత మహిళకు విముక్తి కల్పించడంతో పాటు ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం..

2లో..

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా!

- నవంబర్ 19న ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం ప్రారంభం.
- రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా.
- ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా సిద్దిపేటలో భారీ సభ.
- అదే రోజు ఇందిరమ్మ చీరల పంపిణీ.
- నవంబర్ 20 నుంచి 30 వరకు ఇంటింటికీ దరఖాస్తుల సేకరణ.
- గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల ద్వారా వివరాల నమోదు.
- రాష్ట్రవ్యాప్తంగా 2.25 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి.
- ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్ల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం.
- ఫైర్ సర్వీసెస్ చట్ట సవరణకు గ్రీన్ సిగ్నల్.
- న్యాయస్థానాల్లో 136 కొత్త పోస్టుల మంజూరు.



సచివాలయం:

ప్రపంచ దేశాలతో పోటీపడేలా తెలంగాణ ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు ఉంటాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రపంచదేశాల నుంచి పెట్టుబడిదారులు వస్తారని భావిస్తున్నట్లు చెప్పారు. రైజింగ్ తెలంగాణను మరింత ముందుకు తీసుకెళ్తామన్నారు. కేబినెట్ భేటీ వివరాలను మంత్రి పొంగులేటి మీడియాకు వివరించారు. "గ్లోబల్ సమిట్ నిర్వహణకు సీనియర్ మంత్రులకు బాధ్యతలు కేటాయించారు. రెండో గ్లోబల్ సమిట్‌పై సుదీర్ఘంగా చర్చించాం. సమిట్ సందర్భంగా భారీ పెట్టుబడులు పెడతారనే విశ్వాసం ఉంది. కాళేశ్వరంలో నీళ్లు నిలపవద్దన్న ఎన్‌డీఎస్ఏ ఆదేశాలను అమలు చేశాం. ఎన్‌డీఎస్ఏ చెప్పిన అన్ని పరీక్షల్ని పూర్తి చేసి నివేదించాం. పారదర్శకంగా ప్రాజెక్టు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని నిర్ణయించాం" అని పొంగులేటి

2లో..

బాచుపల్లిలో భవనం పైనుంచి దూకి బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య



హైదరాబాద్:

నగరంలోని బాచుపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో భవనంపై నుంచి దూకి బీటెక్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. విద్యార్థిని క్షితిహాసన్ (20) నిజాంపేట్ హిల్ కౌంటీ ముసోరీ టవర్స్ 13వ అంతస్తు నుంచి కిందకు దూకింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. యువతి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. క్షితిహాసన్.. ముసోరి టవర్స్ పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌లో తన తల్లి, సోదరితో కలిసి ఉంటోంది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, విద్యార్థిని మృతికి కుటుంబసభ్యులే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.


2 లో

అదుపులోకి తీసుకున్నప్పటి నుంచే 24 గంటల గడువు!

- అరెస్టులపై సుప్రీంకోర్టు కీలక స్పష్టీకరణ.
- అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే 24 గంటల లెక్కింపు.
- అధికారిక అరెస్టు సమయం నుంచి గడువు లెక్కించరాదని స్పష్టం.
- నిర్బంధ సమయాన్ని రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేయాలి.
- మేజిస్ట్రేట్లు 24 గంటల నిబంధన అమలును పరిశీలించాలి.
- ప్రయాణ సమయం మినహా ఇతర మినహాయింపులు ఉండవు.
- ప్రాథమిక హక్కుల పరిరక్షణే లక్ష్యంగా కీలక ఆదేశాలు.

అరెస్టులు, నిర్బంధాలు, న్యాయస్థానాల ముందు హాజరుపర్చే విషయంలో 24 గంటల గడువు వంటి అంశాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే.. అతడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చడానికి రాజ్యాంగం విధించిన 24 గంటల డెడ్‌లైన్ ప్రారంభం అవుతుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది .



మేడ్చల్ పారిశ్రామికవాడలో అగ్నిప్రమాదం

హైదరాబాద్:

మేడ్చల్ పారిశ్రామికవాడలో అగ్నిప్రమాదం సంభవించింది. రసాయన గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి.. భారీగా వ్యాపించాయి. పరిసరాల్లో దట్టంగా పొగ కమ్ముకుంది. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలార్పుతున్నారు. దీంతో స్థానికులు, పారిశ్రామిక ప్రాంత కార్మికులు భయాందోళనకు గురయ్యారు.

స్పేస్ పరిశోధనలకు హైదరాబాద్ కేంద్రం!

- అంతరిక్ష పరిశోధనల్లో కొత్త అవకాశాలు: శ్రీధర్‌బాబు.
- పదేళ్లలో ఉపగ్రహాల సంఖ్య 10 లక్షలకు చేరే అవకాశం.
- నిరుపయోగ ఉపగ్రహాలను కక్ష్య నుంచి వెనక్కి తెచ్చే ప్రయోగాలు.
- హైదరాబాద్ కేంద్రంగా దేశంలోనే తొలిసారి వినూత్న ప్రయోగం.
- స్పేస్ కంపెనీల ప్రోత్సాహానికి ప్రత్యేక స్పేస్‌టెక్ పాలసీ.
- ఫ్యూచర్ సిటీలో స్పేస్ సిటీ ఏర్పాటు.



హైదరాబాద్:

అంతరిక్షం.. పరిశోధనలకు కేంద్రంగా మారిందని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఎన్నో దేశాలు శాటిలైట్లను అంతరిక్షంలోకి పంపుతున్నాయని, పదేళ్లలో శాటిలైట్ల సంఖ్య 10 లక్షలకు చేరుకోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నట్లు ఆయన చెప్పారు.

మిగతాద్ది 2 లో

అదుపులోకి తీసుకున్నప్పటి నుంచే 24 గంటల గడువు!

మొదటిపేజీ తరువాయి

అధికారికంగా అరెస్టు చేసినప్పటి నుంచి కాకుండా అదుపులోకి తీసుకున్నప్పటి నుంచే ఆ సమయాన్ని లెక్కించాలని తేల్చిచెప్పింది.“అధికారికంగా అరెస్టు జరిగినప్పటి నుంచే 24 గంటల గడువు ప్రారంభం అవుతుందనే అభిప్రాయం భారతీయ న్యాయసంహితలోని సెక్షన్లకు విరుద్ధం. అదుపులోకి తీసుకోవడానికి, అరెస్టుకు మధ్య వ్యత్యాసాన్ని చూపించి న్యాయపరమైన విచారణను ఆలస్యం చేయడానికి అధికారులకు అనుమతిలేదు. ప్రాథమిక హక్కులను తాత్కాలికంగా నిలిపివేయడం, ఆలస్యం చేయడం రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం ఎట్టి పరిస్థితుల్లో చెల్లదు. వ్యక్తులను కోర్టులో హాజరుపర్చినప్పుడు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న తేదీ, సమయాన్ని మేజిస్ట్రేట్లు కచ్చితంగా నమోదు చేయాలి. 24 గంటల నిబంధన పాటించారో లేదో పరిశీలించాలి” అని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది



ఔచిత్యం కోల్పోయిన ఇద్దరు పిల్లల చట్టాలు

24 గంటల డెడ్‌లైన్ విషయంలో ఒరిస్సా హైకోర్టు, మద్రాస్ హైకోర్టు, కేరళ హైకోర్టు వెలువరించిన అభిప్రాయాలను సుప్రీంకోర్టు తిరస్కరించింది. అధికారిక అరెస్టుకు ముందు నిర్బంధంలో ఉన్న కాలాన్ని మినహాయించడానికి ఆయా న్యాయస్థానాలు గతంలో అనుమతించాయి. దీన్ని అత్యున్నత న్యాయస్థానం వ్యతిరేకించింది. అరెస్టు జరిగిన ప్రదేశం నుంచి కోర్టు వరకు ప్రయాణానికి పట్టే సమయాన్ని మినహా ఇంకే మినహాయింపులు ఉండకూడదని సుప్రీం ధర్మాసనం స్పష్టంగా చెప్పింది. సుజిత్ దాస్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు విచారణ సందర్భంగా సుప్రీం ఈ వ్యాఖ్యలు చేసింది.

కేసు ఏంటంటే..?

త్రిపురలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో గతేడాది సెప్టెంబర్ 29న మధ్యాహ్నం సమయంలో నిందితుడు సుజిత్‌దాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే సెప్టెంబర్ 30 ఉదయం మాత్రమే అతడిని అధికారికంగా అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఆ రోజు సాయంత్రం నాలుగు గంటల సమయంలో మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. అయితే ఉద్దేశపూర్వకంగానే రికార్డుల్లో అరెస్టు సమయాన్ని ఆలస్యంగా చూపించారని నిందితుడి తరపు న్యాయవాదులు వాదించారు. ఇది రాజ్యాంగంలోని నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందంటూ సుప్రీంకోర్టుని ఆశ్రయించారు. కానీ, అధికారికంగా అరెస్టు చేసిన సమయం నుంచే 24 గంటల గడువు వర్తిస్తుందని దర్యాప్తు సంస్థలు కోర్టుకు విన్నవించాయి. దీన్ని న్యాయస్థానం తోసిపుచ్చింది. అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే డెడ్‌లైన్ వర్తిస్తుందంటూ తాజాగా తీర్పునిచ్చింది.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా!

మొదటిపేజీ తరువాయి

క్యాబినెట్ భేటీ కీలక నిర్ణయాలు

దీపావళి సందర్భంగా ‘మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి’ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని క్యాబినెట్ నిర్ణయించింది. మంత్రులు, ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 2,25,000 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయింది. ఆయా ఇళ్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

నవంబర్ 7 నుంచి 9 వరకు కొడంగల్ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారు. నవంబర్ 9న కొడంగల్‌లో భారీ రైతు బహిరంగ సభ నిర్వహిస్తారు. ఈ సభలో ముఖ్యమంత్రి, మంత్రులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొంటారు.

నవంబర్ 19న మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని సిద్దిపేటలో భారీ బహిరంగ సభ, అదే రోజు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఉంటుంది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభమవుతుంది.

నవంబర్ 20 నుంచి 30 వరకు రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఇందిరమ్మ కమిటీలు ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తులు సేకరిస్తాయి. తహశీల్దార్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు వాటిని స్వీకరిస్తారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా వర్తిస్తుంది.

రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఉమ్మడి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను రద్దు చేసి.. ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరుగా కమిషన్లు ఏర్పాటు చేయాలని తెలంగాణ క్యాబినెట్ నిర్ణయించింది. ఇందుకు సంబంధించి తెలంగాణ స్టేట్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ కాస్ట్స్ అండ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ యాక్ట్, 2003ను రద్దు చేసేందుకు ఆమోదం తెలిపింది. ప్రతి కమిషన్‌లో ఒక చైర్మన్, ఐదుగురు సభ్యులు ఉంటారు. ఎస్సీ, ఎస్టీల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది.

తెలంగాణ ఫైర్ సర్వీస్ యాక్ట్, 1999 సవరణకు సంబంధించిన ఆర్డినెన్స్ జారీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం, ప్రమాదాలకు కారణాలను గుర్తించడం, వేగంగా స్పందించడం వంటి అంశాలు ఇందులో ఉంటాయి. ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల యజమానులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్నిమాపక శాఖ చేపట్టాల్సిన చర్యలను ఇందులో పొందుపరుస్తారు.

తెలంగాణ సర్వే, సరిహద్దుల చట్టం, 1923లోని సెక్షన్ 12(ఏ) సవరణ ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సర్వే, సరిహద్దులకు సంబంధించి జారీ చేసే నోటీసులపై అప్పీల్ చేసుకునే కాలపరిమితిని 60 రోజుల నుంచి 30 రోజులకు తగ్గించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో కొత్తగా ఏర్పాటైన జూనియర్ సివిల్ జడ్జి కమ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు, హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి కోర్టు కోసం 56 పోస్టుల మంజూరుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్, మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని నాలుగు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుల్లో వివిధ విభాగాలకు మరో 80 పోస్టులు.. మొత్తం 136 పోస్టుల మంజూరుకు మంత్రివర్గం గ్రీన్

ఇరాన్‌కు సాయం.. భారతీయ జంటపై అమెరికా ఆంక్షలు..!



భారత్‌కు చెందిన వ్యాపారవేత్త, ఆయన భార్యపై అమెరికా ఆంక్షలు విధించింది. వారితో పాటు భారత్, తుర్కియేలోని పలు కంపెనీలు, వ్యక్తులను ఈ ఆంక్షల జాబితాలో చేర్చింది. చమురు ఎగుమతుల విషయంలో అంతర్జాతీయ ఆంక్షలను తప్పించడానికి ఇరాన్ కు సహకరించారన్న ఆరోపణలపై అగ్రరాజ్యం ఈ చర్యలు తీసుకుంది. మధ్యంతర ఎన్నికల ఫలితాల అనంతరం అమెరికా ట్రెజరీ విభాగం నుంచి ఈ నిర్ణయం వెలువడటం గమనార్హం.

ఇరాన్ ఆర్థిక వనరులను పూర్తిగా దెబ్బతీసేందుకు, ఆ దేశాన్ని అంతర్జాతీయంగా ఒంటరిని చేసేందుకు అమెరికా ‘ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్’ పేరిట ఆంక్షలు విధిస్తోంది. అలాగే ఇరాన్ ప్రభుత్వానికి సహకరించేవారినీ వదలబోమని ఇప్పటికే పలుమార్లు హెచ్చరించింది. ఈ క్రమంలోనే భారత్‌కు చెందిన సునీల్ కుమార్ శర్మ, ఆయన భార్య జస్‌ప్రీత్ ప్రీతి షాహిద్‌తో పాటు మరో ఇద్దరు భారతీయులపై ఆంక్షలు విధించింది. అలాగే శర్మకు చెందిన 9 సంస్థలు కూడా ఆంక్షల జాబితాలో ఉన్నాయి. “ఇరాన్ పెట్రోలియం రవాణాలో భాగమై ఆంక్షలకు గురైన నౌకలకు తప్పుడు గుర్తింపు, ధ్రువీకరణ పత్రాలను అందించడంలో వారు సహకరించారు. ఇరాన్ సైన్యం, దాని అనుబంధ సంస్థల నౌకలకు కూడా ఈ తరహా సేవలు అందించారు” అని ట్రెజరీ విభాగం పేర్కొంది.

అలాగే తుర్కియే కు చెందిన ఫుగో గ్రౌండ్ సర్వీసెస్ సంస్థ పేరునూ ఈ ఆంక్షల జాబితాలో చేర్చారు. ఇరాన్ విమానయాన రంగానికి మద్దతు ఇస్తోందని ఆరోపిస్తూ అగ్రరాజ్యం ఈ చర్యలు తీసుకుంది. “మీరు మాతో ఉన్నారా? మాకు వ్యతిరేకంగా ఉన్నారా? అనేది మేం తెలుసుకుంటాం. ఇరాన్ పాలనకు మద్దతు ఇచ్చే వారిపై ఆంక్షలు తప్పవు” అని ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ మరోసారి హెచ్చరించారు.

అమెరికా మిడ్‌టర్మ్ ఫలితాలు.. ట్రెండింగ్‌లో ‘హబీబీ మీనింగ్’



అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల ఫలితాల్లో రిపబ్లికన్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలిన సంగతి తెలిసిందే. డెమోక్రాట్లు ఉభయ సభల్లో ఆధిపత్యాన్ని సంపాదించారు. ఈ ఫలితాల అనంతరం నెటిజన్లు ‘హబీబీ మీనింగ్’ కోసం తెగ వెతుకుతున్నారు. ఇంతకీ ఏం జరిగిందంటే..?

మిషిగన్ సెనెటర్‌గా డెమోక్రాట్ అబ్దుల్ ఎల్ సయెద్ విజయం సాధించారు. ఆ గెలుపు అనంతరం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ ‘హబీబీ’ అనే అరబిక్ పదం వాడారు. “ జేడీ.. హబీబీ.. జనవరిలో నా ప్రమాణస్వీకారం చేయించాల్సిన బాధ్యత నీపైనే ఉంది. అది నిజంగా విచిత్రమే” అని వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచార సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, జేడీ వాన్స్.. అబ్దుల్‌పై జాతి, మతపరమైన విమర్శలు చేశారు. ప్రచార సమయంలో అబ్దుల్ పేరును ట్రంప్ హేళన చేశారు.

అమెరికా చట్టాల ప్రకారం.. ఉపాధ్యక్షుడు సెనెట్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తారు. దాంతో కొత్తగా ఎన్నిక సభ్యులతో జేడీ వాన్స్ ప్రమాణస్వీకారం చేయించాల్సి ఉంటుంది. రిపబ్లికన్ నేతల విద్వేష వ్యాఖ్యలకు అబ్దుల్ ఇలా ‘హబీబీ’ అంటూ తిప్పికొట్టారు. అప్పటి నుంచే ఈ వర్డ్ ట్రెండ్ అవుతోంది. దాని అర్థం కోసం నెటిజన్లు వెతుకుతున్నారు. ‘హబీబీ’ అంటే మై లవ్ అని అర్థం. మామూలుగా స్నేహితులు, కుటుంబ సభ్యులను ప్రేమగా పిలిచేందుకు ఈ పదాన్ని వాడుతుంటారు

బ్యాంక్ పతనం.. 30 లక్షల మంది కస్టమర్ల గగ్గోలు.. అధ్యక్షుడి రాజీనామా

దక్షిణ అమెరికా దేశమైన పరాగ్వేలో అతిపెద్ద బ్యాంకుల్లో ఒకదాంట్లో తీవ్ర సంక్షోభం నెలకొంది. అధ్యక్షుడు శాంటియాగో పెనాతో సన్నిహిత సంబంధాలున్న ఓ బ్యాంకును ఆ దేశ సెంట్రల్ బ్యాంకు తన ఆధీనంలోకి తీసుకుంది. దీంతో రూ.కోట్లాది రూపాయల ప్రజాధనం అనిశ్చితిలో చిక్కుకుంది. రాత్రికి రాత్రే లావాదేవీలు నిలిపివేయడంతో లక్షలాది మంది ఖాతాదారులు వీధుల్లోకి వచ్చి ఆందోళన బాటపట్టారు.

ఉయెనో బ్యాంకు పరాగ్వేలో అతిపెద్ద రుణదాతల్లో ఒకటి. దేశవ్యాప్తంగా 30లక్షల వినియోగదారులు ఉన్నట్లు బ్యాంకు వెల్లడించింది. దేశ జనాభాలో దాదాపు 60శాతం. సుమారు వేల కోట్ల మేర ఖాతాదారుల నిధులను నిర్వహిస్తుంది. వీటిలో సుమారు రూ.3వేల కోట్ల మేర ప్రభుత్వ డిపాజిట్లే ఉన్నట్లు సమాచారం.

భారత పాలకులకు హెచ్చరిక..

బ్యాంకు పరిస్థితి ఇటీవల దారుణంగా దెబ్బతింది. మూలధనం కనిష్ఠస్థాయి కంటే తక్కువకు పడిపోయింది. దీంతో రంగంలోకి దిగిన సెంట్రల్ బ్యాంక్.. స్వాధీనానికి ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. తద్వారా సంక్షోభానికి పరిష్కారం చూపించి డిపాజిటర్లకు కొంత మొత్తంలో తిరిగి చెల్లించే ప్రక్రియ చేపట్టేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. అయితే, ఆర్థిక పరిస్థితి దెబ్బతినడం, రాత్రికి రాత్రే బ్యాంకు యాప్ నిలిచిపోవడంతో ఖాతాదారుల్లో ఆగ్రహం పెల్లుబికింది. దీంతో అన్ని బ్రాంచీల వద్ద పోలీసులను మోహరించారు.

రాజకీయ జోక్యం..

బ్యాంకు ఈ పరిస్థితికి రావడానికి రాజకీయ జోక్యమే ప్రధాన కారణమనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా యాజమాన్యానికి సంబంధించిన వారికే భారీ మొత్తంలో రుణాలు ఇచ్చిందనే ఆరోపణలు వచ్చాయి. ఉయెనో బ్యాంకు మాతృ సంస్థలో అధ్యక్షుడు పెనాకు భాగస్వామ్యం ఉందనే వాదనలు వినిపించాయి.

పంజగుట్ట: స్పా ముసుగులో వ్యభిచార గృహం

మొదటిపేజీ తరువాయి

సన్నెలోయిన నాగమణి పంజగుట్ట నాగార్జున సర్కిల్ సమీపంలో ఓ ఫ్లాట్ అద్దెకు తీసుకుంది. అక్కడ స్పా కేంద్రాన్ని ఏర్పాటు చేసి చేసింది. మసాజ్ సేవల కోసం మహిళలకు నెలవారీ జీతం ఆశ చూపి పనిలోకి తీసుకుంది.

అనంతరం వారిని బెదిరించి బలవంతంగా వ్యభిచారంలోకి దింపింది. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం రాత్రి 11 గంటలకు ఇన్‌స్పెక్టర్ ఈ.జహంగీర్ యాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు స్పాపై దాడి చేశారు. ప్రధాన నిర్వాహకురాలు నాగమణిని అరెస్టు చేసి నాంపల్లిలోని 14వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. బాధిత మహిళను రెస్క్యూ హోమ్‌కు పంపించారు. ఇద్దరు విటులకు నోటీసులు జారీ చేశారు.

ఆ సమాధానాలు తట్టుకోలేక పారిపోతారు: రాహుల్‌పై అమిత్‌షా ధ్వజం

మొదటిపేజీ తరువాయి

గందరగోళం సృష్టించేందుకు వీధుల్లో జనాలను సమీకరించుకుంటున్నారు” అని హరియాణాలో జరిగిన సభలో అమిత్ షా మండిపడ్డారు.

న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోంది

హరియాణాలోని కర్నాల్ ప్రాంతంలో అమిత్‌షా, ఇతర కీలక నేతలంతా ‘లోక్‌తంత్ర బచావో, అరాజకతా హఠావో’ పేరిట పాదయాత్రలో పాల్గొన్నారు. సర్‌పై చర్చించేందుకు పార్లమెంట్‌లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర హోంమంత్రి స్పష్టం చేశారు. “2014లో సర్ ఉందా..? అయినా సరే మీ పార్టీ తుడిచిపెట్టుకుపోయింది. 2019, 2024లోనూ మీకదే పరిస్థితి. అప్పుడు కూడా సర్ లేదు. వీధుల్లో జనాలను సమీకరించే ప్రయత్నాలను రాహుల్ కొనసాగిస్తే.. భాజపా నుంచి తగిన సమాధానం వస్తుంది” అని పేర్కొన్నారు.

దేశాన్ని అస్థిరపరిచేందుకు విపక్షాలు విదేశీ శక్తుల సాయం తీసుకుంటున్నాయంటూ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై బహిరంగ చర్చకు రావాలని రాహుల్ డిమాండ్ చేస్తోన్న సంగతి తెలిసిందే. మోదీయే విదేశీ శక్తుల అండతో ప్రధాని పీఠాన్ని కాపాడుకుంటున్నారని విమర్శించారు. లోక్‌సభలో చర్చ అంటారుకానీ తాను మాట్లాడకుండా మైక్ కట్ చేస్తారని ఆరోపించారు.

ఆర్ఆర్ ట్యాక్స్‌పై మోదీ, అమిత్‌షా చర్యలేవీ?: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి ఆర్ఆర్ ట్యాక్స్ విధిస్తున్నారని ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆరోపించడం తప్ప ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. భాజపా, కాంగ్రెస్‌ల మధ్య ఉన్న అంతర్గత అవగాహనే దీనికి కారణమన్నారు. ఈ మేరకు ‘ఎక్స్’లో కేటీఆర్ పోస్ట్ చేశారు. హైదరాబాద్‌లో ఏ బిల్డర్‌ను అడిగినా ఆర్ఆర్ ట్యాక్స్ వాస్తవమేనని చెబుతారన్నారు. చదరపు అడుగుకు రూ.200 వసూలు చేస్తున్నది వాస్తవమని ఆరోపించారు.

స్పేస్ పరిశోధనలకు హైదరాబాద్ కేంద్రం!

మొదటిపేజీ తరువాయి

కాస్మోసర్వ్ కార్యాలయాన్ని దిల్లీ నుంచి కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. నిరుపయోగ శాటిలైట్లను కక్ష్య నుంచి వెనక్కి తేవడం ముఖ్యమన్నారు. దేశంలో తొలిసారి హైదరాబాద్ కేంద్రంగా ఈ తరహా ప్రయోగం చేపడుతున్నట్లు చెప్పారు. “ కాస్మోసర్వ్ కంపెనీ అంతరిక్షం నుంచి వ్యర్థాలు తెచ్చే సాంకేతికతను అభివృద్ధి చేస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా ఎన్నో స్పేస్ కంపెనీలు పని చేస్తున్నాయి. వీటికి ప్రోత్సహించేందుకు స్పేస్‌టెక్ పాలసీ తీసుకొస్తాం. ఫ్యూచర్ సిటీలో స్పేస్ సిటీ ఏర్పాటు చేస్తాం” అని అన్నారు.

భారత్‌లో నివసిస్తున్న విదేశీ పౌరులకు.. పాస్‌పోర్ట్, వీసా



నిబంధనల సడలింపు!

భారత్‌లో నివసిస్తున్న కొన్ని కేటగిరీల విదేశీ పౌరుల కోసం కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్ట్, వీసా నిబంధనలను సడలించింది. కేంద్ర హోంశాఖ ఈ మేరకు ‘ఇమిగ్రేషన్ అండ్ ఫారినర్స్ (ఎగ్జెంప్షన్) (అమెండ్‌మెంట్) ఆర్డర్, 2026’ను విడుదల చేసింది. దీని ద్వారా కొంతమంది పాకిస్థానీ పౌరులు, మైనారిటీ శరణార్థులు, శ్రీలంక తమిళులు, టిబెటన్లకు ఉపశమనం లభించనుంది. అదేవిధంగా భారత్, నేపాల్, భూటాన్ పౌరులు.. ఈ మూడు దేశాల మధ్య రాకపోకలు సాగించే సమయంలో సాధారణ పాస్‌పోర్ట్ బదులు అధికారిక ‘వీసా మాన్యువల్’లో పేర్కొన్న గుర్తింపు పత్రాలు సరిపోతాయని పేర్కొంది.

కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ ప్రకారం.. శాశ్వతంగా నివాసించాలనే ఉద్దేశంతో 2009 డిసెంబర్ 31లోపు భారత్‌కు వచ్చిన పాకిస్థానీ పౌరులు; మలేషియా లేదా సింగపూర్ పౌరసత్వం తీసుకుని 2009 డిసెంబర్ 31లోపు తిరిగి వచ్చిన భారత మూలాలున్న వ్యక్తులు; మతపరమైన హింస కారణంగా 2024 డిసెంబర్ 31లోపు వచ్చిన అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ మైనారిటీలు (హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రైస్తవులు); 2015 జనవరి 9లోపు ఆశ్రయం పొందిన శ్రీలంక తమిళులు; అర్హులైన కొంతమంది టిబెటన్లకు కొన్ని షరతులతో

అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాలపై నెల రోజుల్లో చర్యలు తీసుకోవాలి: కల్వకుంట్ల కవిత

హైకోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా అనుమతులు ఇస్తున్నారు..
500 నుంచి 700 వరకు అక్రమ భవనాలు నిర్మించారు
నెల రోజుల్లో చర్యలు తీసుకోకపోతే మా పార్టీ తరపున వెళ్లి రెడ్ మార్క్ వేస్తాం



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 5:

హైదరాబాద్‌లోని అయ్యప్ప సొసైటీ, ఖానామెట్ ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అయ్యప్ప సొసైటీ పరిధిలో 500 నుంచి 700 వరకు అక్రమ భవనాలు నిర్మించారని, ప్రస్తుతం కూడా దాదాపు 80 భవనాలు నిర్మాణంలో ఉన్నాయని ఆరోపించారు. హైకోర్టు ఆదేశాలను సైతం పట్టించుకోకుండా అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారని విమర్శించారు. నెల రోజుల్లోగా అక్రమ భవనాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేదంటే తమ పార్టీ తరపున వెళ్లి ఆయా భవనాలకు రెడ్ మార్క్ వేస్తామని హెచ్చరించారు.

బంజారాహిల్స్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరాన్ని ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ సభ్యులు కామధేనువుగా మార్చుకుని అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నగరంలో రోడ్లు, బస్తీ దవాఖానాలు, మంచినీటి సమస్యలను పరిష్కరించకుండా భూములు, నిర్మాణ అనుమతులు, టీడీఆర్ పేరుతో అక్రమ దందాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. భూదాన్ ఉద్యమ స్ఫూర్తితో తెలంగాణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో అయ్యప్ప సొసైటీలో 150 ఎకరాల భూమితో గురుకుల ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఆ భూములను కాపాడేందుకు ట్రస్ట్ చైర్మన్ విఠల్ రావు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేశారని తెలిపారు. అయితే ప్రస్తుతం ఆ ప్రాంతంలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపించారు.ఖానామెట్‌లో సర్వే నంబర్లు 11/18 నుంచి 44 వరకు వరుసగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, సర్వే నంబర్ 12లో 12 అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారని కవిత పేర్కొన్నారు. కేవలం నోటరీ ద్వారా రిజిస్ట్రేషన్లు చేస్తూ పది అంతస్తుల వరకు అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. రెండు భవనాల మధ్య కనీసం అగరుబత్తి పట్టేంత స్థలం కూడా ఉండటం లేదని, ఇలాంటి భవనాల్లో కాలేజీలు, పీజీ హాస్టళ్లు నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రతి భవనంలో సెల్లార్ కిచెన్లు ఉండటంతో అగ్నిప్రమాదాలు జరిగితే భారీ ప్రాణ, ఆస్తి నష్టం సంభవించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ పరిస్థితులపై సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎందుకు తనిఖీలు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. అధికారులపై ఎవరి ఒత్తిడి ఉందో, అక్రమ నిర్మాణాలను అడ్డుకోకుండా ఎవరు ఆపుతున్నారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి నివాసానికి సమీపంలోనే ఇంత పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు లేనందున నిర్మాణాలు చేపట్టవద్దని హైకోర్టు ఆదేశాలు ఉన్నాయని కవిత పేర్కొన్నారు. అయినప్పటికీ ఆ ఆదేశాలను పట్టించుకోకుండా అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి సోదరులు దగ్గరుండి అనుమతులు ఇప్పిస్తూ అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారని, పలువురు బిల్డర్లకు కూడా ప్రభుత్వం సహకరిస్తోందని విమర్శించారు. గల్ఫ్ ఆయిల్ సంస్థకు కూడా ఇదే విధంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. అక్రమ భవనాలపై ఓ పత్రిక గూగుల్ మ్యాప్ ఆధారాలతో కథనం ప్రచురించిందని, తాను ఆ కథనాన్ని ట్యాగ్ చేసిన తర్వాత మీడియా ప్రతినిధులు అక్కడికి వెళ్లి వివరాలు సేకరించేందుకు ప్రయత్నించారని చెప్పారు. అయితే భవనాల యజమానులు మీడియా ప్రతినిధులను బెదిరిస్తున్నారని, తమ వెనుక ప్రభుత్వం ఉందని చెబుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో ఉన్నది ప్రజా ప్రభుత్వమా? రౌడీ రాజ్యమా? అని ప్రశ్నించారు.

మంథని నియోజకవర్గంలోని శాత్రాజుపల్లి గ్రామంలో సర్వే కూడా పూర్తికాకముందే అర్ధరాత్రి 374 ఇళ్లను కూల్చివేశారని ఆరోపించిన కవిత.. హైదరాబాద్‌లో వ్యాపారవేత్తలు అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు. వ్యాపారవేత్తలకు అండగా నిలుస్తూ పేదలపై మాత్రమే ప్రతాపం చూపుతున్నారని విమర్శించారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఆదిత్య బిల్డర్స్ నిర్మాణాలపై గతంలో తమ పార్టీ ధర్నా నిర్వహించిందని, అయినప్పటికీ అక్కడ మరో మూడు కొత్త ప్రాజెక్టులు చేపడుతున్నారని ఆరోపించారు. ఆ సంస్థ యజమాని ముఖ్యమంత్రి సోదరులకు విల్లా ఇవ్వడం వల్లే నిర్మాణ అనుమతులు లభించాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఎక్కువ దోపిడీ చేస్తే ప్రకృతి కూడా క్షమించదని, తగిన శిక్ష విధిస్తుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) అమలు జోక్‌గా మారిందని కవిత విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 18 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, అడిగిన సమాచారాన్ని అధికారులు అందించడం లేదని ఆరోపించారు. ఒక్క జిల్లాలోనే 800 దరఖాస్తులకు ఒకేరోజు సమాధానం ఇవ్వలేమంటూ అధికారులు చేతులెత్తేశారని పేర్కొన్నారు. అయ్యప్ప సొసైటీకి సంబంధించిన తాను అడిగిన ప్రశ్నలకు ఆర్టీఐ ద్వారా సమాధానాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వానికి నెల రోజుల గడువు

అయ్యప్ప సొసైటీ, ఖానామెట్ ప్రాంతాల్లో సమగ్ర సర్వే నిర్వహించాలని కవిత డిమాండ్ చేశారు. అనుమతులు లేని భవనాలు, అక్రమ అంతస్తులు, ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. నోటరీ ద్వారా జరుగుతున్న రిజిస్ట్రేషన్లపై రిజిస్ట్రేషన్ల శాఖ విచారణ చేపట్టాలని సూచించారు. అక్రమ నిర్మాణాల విషయంలో నెల రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి గడువు ఇచ్చారు. లేనిపక్షంలో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లి అక్రమ భవనాలకు రెడ్ మార్క్ వేస్తామని హెచ్చరించారు. ప్రజలు ఆ ప్రాంతంలో భూములు కొనుగోలు చేసి ఇబ్బందులు పడవద్దని సూచించారు. అక్రమ నిర్మాణాలు చేపడుతున్న బిల్డర్లు, నోటరీ ద్వారా రిజిస్ట్రేషన్లు చేస్తున్న వారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. అయ్యప్ప సొసైటీలో నిజమైన భూ యజమానులకు తమ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

అమిత్ షా పర్యటనపైనా విమర్శలు

రాష్ట్రానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా వచ్చి రాజకీయ విమర్శలు చేయడం తప్ప తెలంగాణకు ఎలాంటి ప్రయోజనం కల్పించలేదని కవిత విమర్శించారు. రాష్ట్రంలోని 320 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, కేంద్రం నుంచి సహాయం అందుతుందని ఆశించామని చెప్పారు. కానీ కాంగ్రెస్ ఢిల్లీలో ధర్నా చేసిందనే కారణంతో హైదరాబాద్‌లో ధర్నా చేయడం మినహా రాష్ట్రానికి, నగరానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆరోపించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని చెప్పడం తప్ప ప్రజలకు ఏం చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. దేశంలో 13 కోట్ల మంది విదేశీయులు ఉన్నారని అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. గతంలో ఇదే విదేశీయుల ఓట్లతో ఎన్నికల్లో గెలిచారా? అని ప్రశ్నించారు. ఇలాంటి వ్యాఖ్యలతో ప్రజలను ఎందుకు తప్పుదోవ పట్టిస్తున్నారని నిలదీశారు.

రైతులు, విద్యుత్ సమస్యలపై ఆందోళన

తన వద్ద ఒక్క ఇంచు అసైన్డ్ భూమి లేదా ఇనాం భూమి ఉన్నా ప్రభుత్వానికి ఇచ్చేస్తానని కవిత ప్రకటించారు. గోదావరి, కృష్ణా జలాలను ఎత్తిపోసే చర్యలు చేపట్టకుండా రాష్ట్రంలో నీళ్లు లేవని ముఖ్యమంత్రి చెబుతున్నారని విమర్శించారు. పంటలు వేయవద్దని సీఎం చెబుతున్నారని, అలా చెప్పలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పెద్దల మధ్యే సమన్వయం లేకపోవడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారని అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ కొరత తీవ్రంగా ఉందని, ఆ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మహిళా ఓటర్లు పెద్ద ఎత్తున నమోదు కావాలి

గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో మహిళా ఓటర్లు పెద్ద సంఖ్యలో తమ పేర్లను నమోదు చేసుకుని టీఆర్ఎస్‌కు మద్దతుగా నిలవాలని కవిత పిలుపునిచ్చారు. మహిళల కోసం, మహిళల చేత నిర్వహించబడుతున్న పార్టీగా టీఆర్ఎస్‌ను అభివర్ణించారు. మహిళల భాగస్వామ్యంతో రాజకీయాల్లో మరింత మార్పు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అక్రమాలంటూ ఆందోళన



యాదాద్రి భువనగిరి, నవంబరు05/ట్రైనెట్ న్యూస్:

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం గురువారం రోజు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అర్హులకు అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ పలువురు సర్పంచులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఇందిరమ్మ కమిటీలు సర్పంచుల ప్రమేయం లేకుండానే అనర్హులను ఎంపిక చేస్తున్నాయని బిసు ధనలక్ష్మి, సుంకరి మంజుల, సంగపాక శ్రీవాణి, నర్రముల రామలింగయ్య యాదవ్, ఎరుకల యాతీశ్వర్ గౌడ్, కట్టేకోల శ్రీహరి గౌడ్,కొంగరి యాదగిరి ఆరోపించారు. అర్హులైన పేదలకు ఇళ్లు దక్కేలా ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఉపాధి హామీ పథకం(వి-బిజీ రామ్ జీ)16వ విడత సామాజిక తనిఖీ గ్రామ సభ



యాదాద్రి భువనగిరి, నవంబరు05/ట్రైనెట్ న్యూస్:

యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గురువారం రోజున ఉదయం 9.00 గంటలకి గ్రామపంచాయతీ ఆవరణంలో దత్తాయపల్లి గ్రామ ఉపసర్పంచ్ జిట్టా బాలకృష్ణ అధ్యక్షతన ఉపాధి హామీ పథకం(విబి-జీ రామ్ జీ) 16వ విడత సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో దానబోయిన నవీన్ వార్డు సభ్యులు(కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు),గుంటి రాజు వార్డు మెంబర్, దానబోయిన రాణి వార్డు సభ్యులు, శ్రీధర్ డిఆర్పి,సాయికుమార్ గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ స్వాతి, అంగన్వాడీ టీచర్స్,రాణి,భాగ్యలక్ష్మి,సరిత బి బి కే,దత్తాయపల్లి గ్రామపుర ప్రముఖులు, ఉపాధి హామీ కూలీలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మోటకొండూరు పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



యాదాద్రి భువనగిరి, నవంబరు05/ట్రైనెట్ న్యూస్:

యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ మోటకొండూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, రిజిస్టర్లు, కేసుల వివరాలు మరియు పోలీస్ శాఖలోని వివిధ విభాగాల (ఎవతీఅఖిశ్రీం) పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి, పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది విధుల నిర్వహణపై సమీక్షించారు.అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి విధులు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ నేరాల నియంత్రణకు సమర్థవంతంగా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు.శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎస్పీ గారు సిబ్బందికి ఆదేశించారు. ఈ తనిఖీలో మోటకొండూర్ ఎస్ఎచ్ఓ బి. కుమారస్వామి,ఏఎస్ఐ ప్రకాష్, ఇతర పోలీస్ సిబ్బంది హాజరయ్యారు.

భూగర్భజలాల పరిరక్షణకు అవసరమైనన్ని నిధులు కేటాయిస్తాం

జిల్లాలవారీగా భూగర్భజలాల పరిస్థితిపై సమగ్ర సమీక్ష.. తెలంగాణ అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించాలి:
-మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
రాజస్థాన్, మహారాష్ట్రలో అమలవుతున్న జల సంరక్షణ కార్యక్రమాలపై అధ్యయనం చేయాలని అధికారులకు ఆదేశం



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 5:

రాష్ట్రంలో భూగర్భజలాల పరిరక్షణ, పునరుద్ధరణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. భూగర్భజలాల సంరక్షణకు అవసరమైనన్ని నిధులు కేటాయిస్తామని, అవసరమైతే ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులకు మించి నిధులు సమకూర్చేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన కరువు ఉపశమన చర్యలు, భూగర్భజలాల సంరక్షణ, పునరుద్ధరణపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూగర్భజలాల పరిస్థితి, భవిష్యత్తులో చేపట్టాల్సిన సంరక్షణ చర్యలు, వివిధ శాఖల సమన్వయంతో రూపొందించాల్సిన కార్యాచరణ ప్రణాళికపై అధికారులతో చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భూగర్భజలాల మట్టాలు ఆందోళనకర స్థాయికి చేరుతున్నాయంటూ వస్తున్న వార్తలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. జిల్లాలవారీగా భూగర్భజలాల స్థితిగతులను సమగ్రంగా సమీక్షించి, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. భూగర్భజల శాఖ పనితీరు, ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలు, భవిష్యత్తులో అమలు చేయాల్సిన చర్యలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల భూగర్భజల శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, ప్రతి జిల్లాలో భూగర్భజలాల పరిస్థితిపై సమగ్ర నివేదిక రూపొందించాలని ఆదేశించారు. ప్రస్తుతం భూగర్భజలాల సంరక్షణ కోసం చేపడుతున్న పనులు, వాటి ఫలితాలు, రానున్న రోజుల్లో అవసరమయ్యే చర్యలను అంచనా వేసి పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.

ఇతర రాష్ట్రాల జల సంరక్షణ విధానాలపై అధ్యయనం

భూగర్భజలాల పరిరక్షణలో ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా రాజస్థాన్‌లో భూగర్భజలాల పునరుద్ధరణ కోసం చేపట్టిన కార్యక్రమాలు, మహారాష్ట్రలో అమలవుతున్న జల సంరక్షణ చర్యలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఆ రాష్ట్రాల్లో విజయవంతంగా అమలవుతున్న విధానాలను అధ్యయనం చేసి, తెలంగాణ భౌగోళిక పరిస్థితులు, నీటి అవసరాలకు అనుగుణంగా వాటిని అమలు చేసే అవకాశాలను పరిశీలించాలన్నారు. ఇతర రాష్ట్రాల అనుభవాలను ఉపయోగించుకుని తెలంగాణలో భూగర్భజల సంరక్షణ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు.

శాఖల సమన్వయంతో కరువు ఉపశమన కార్యాచరణ

కరువు ఉపశమన చర్యలు, భూగర్భజలాల సంరక్షణ పనుల అమలులో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, భూగర్భజల, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ఆయా శాఖల పరిధిలో చేపట్టాల్సిన పనులను గుర్తించి, సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల పరిరక్షణ, భూగర్భజలాల పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఈఎన్‌సీ రమేష్‌బాబు, నీటిపారుదల శాఖ సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ దివ్య, భూగర్భజల శాఖ డైరెక్టర్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నిరసన తెలిపిన బిఆర్ఎస్ మరియు బీజేపీ సర్పంచ్లు

యాదాద్రి భువనగిరి, నవంబరు05/ట్రైనెట్ న్యూస్:



యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ పథకాలు అయినటువంటి ఇందిరమ్మ ఇళ్ళు గీత కార్మికుల పెన్షన్స్,90% వరకు అర్హులైన వారికీ నిరుపేదలకు కాకుండా నచ్చిన వారికీ ఇస్తున్నారని దీనివల్ల అర్హులైన వారు నిరుపేదలు నష్టపోతున్నారని బిఆర్ఎస్,బీజేపీ సర్పంచ్లు సమావేశన్ని బైకాట్ చేసి ఆఫీస్ ఎదుట బైటయించి నిరసన తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆత్మకూరు(ఎం)సర్పంచ్ బీసు ధనలక్ష్మి మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందాయని కాని కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను ఎమ్మెల్యే, వారి అనుచరులు ఇష్టనుసారంగా కేటాయిస్తున్నారని ఆత్మకూరు(ఎం)లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎలా ఎంపిక చేసారో ఎంపీడీఓ ని అడిగితె పొంతన లేని సమాధానం చెపుతున్నారని గీత కార్మికుల పెన్షన్ కూడా నిజమైన అర్హులైన వారికీ రాలేదని అన్నారు.ఇది ఇలాగే కొనసాగితే నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పల్లెపహాడ్ సర్పంచ్ మంజుల,రాఘవ పురం సర్పంచ్ ఎరుకల యతీశ్వర్ గౌడ్,పుల్లయిగూడెం సర్పంచ్ నర్రాముల రామలింగయ్య యాదవ్, కాప్రాయిపల్లి సర్పంచ్ కొంగరి యాదగిరి,మోదుగుబావి గూడెం సర్పంచ్ కట్టేకోల శ్రీహరి గౌడ్ లు నిరసన తెలిపారు.

38 బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి రూ.88.50 కోట్ల నిధులు మంజూరు చేస్తూ జీవోలు జారీ

కుల సంఘాల ప్రతినిధులకు జీవో పత్రాలు అందజేసిన మంత్రి పొన్నం ప్రభాకర్
కార్తీక మాసంలోనే భవన నిర్మాణాలకు శంకుస్థాపనలు చేసుకోవాలి - ఏడాదిలోగా నిర్మాణాలు పూర్తి చేయడమే లక్ష్యంలి
బీసీలకు కేటాయించిన భూములను ఏ ప్రభుత్వం కూడా వెనక్కి తీసుకునే పరిస్థితి లేదు.. అవి బలహీన వర్గాల ఆస్తులు - మంత్రి పొన్నం ప్రభాకర్లి



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 5:

రాష్ట్రంలో 38 బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో ఆయా కుల సంఘాలకు కేటాయించిన భవన నిర్మాణాలకు సంబంధించి రూ.88.50 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవోలు జారీ చేసింది. ఈ మేరకు గురువారం మినిస్టర్ క్వార్టర్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ కుల సంఘాల ప్రతినిధులకు ప్రభుత్వం విడుదల చేసిన జీవో పత్రాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీ సురేష్ షెట్కర్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయ దేవి, మాజీ ఓబీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఇతర కార్పొరేషన్ చైర్మన్లు, బీసీ సంఘాల ముఖ్య నేతలు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు, ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవన నిర్మాణాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. గతంలో స్థలాలు కేటాయించినప్పటికీ కొన్ని పరిపాలనా, సాంకేతిక కారణాల వల్ల నిర్మాణాలు ముందుకు సాగలేదని, హెచ్ఎండీఏ సహకారంతో ఆ సమస్యలను పరిష్కరించామని చెప్పారు.

కుల సంఘాలకు కేటాయించిన స్థలాలను నిర్మాణాలకు అనువుగా తీర్చిదిద్దేందుకు 'రెడీ టు కన్స్ట్రక్షన్' విధానంలో లేఅవుట్లను అభివృద్ధి చేశామని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినందున కుల సంఘాలు ఎలాంటి జాప్యం చేయకుండా వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. కార్తీక మాసంలోనే ఆత్మగౌరవ భవనాలకు శంకుస్థాపనలు చేసుకోవాలని కోరారు.

కేవలం స్థలాలు, నిధులు కేటాయించి చేతులు దులుపుకునే ప్రభుత్వం తమది కాదని, భవనాలను నిర్మించి బీసీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. ఏడాది కాలంలోగా లేదా నిర్మాణ పరిస్థితులను బట్టి నిర్ణయించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. నిర్మాణాలకు అవసరమైన అనుమతులను ఇంజనీరింగ్ శాఖ, హెచ్ఎండీఏ సమన్వయంతో కల్పిస్తామని, సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేసి ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించి ప్రోగ్రెస్ రిపోర్టులు తీసుకుంటామని చెప్పారు.

బీసీల భూములపై దుష్ప్రచారాన్ని నమ్మవద్దు

బీసీ కుల సంఘాలకు కేటాయించిన భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని మంత్రి స్పష్టం చేశారు. బీసీలకు కేటాయించిన భూములు బలహీన వర్గాల ఆస్తులని, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే కాకుండా ఏ ప్రభుత్వం కూడా తిరిగి తీసుకునే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. ఆ భూముల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు.

కేటాయించిన నిధులతో నిర్దీత కాలపరిమితిలో భవన నిర్మాణాలు పూర్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత కుల సంఘాలపై కూడా ఉందని, నిర్మాణాల్లో జాప్యం జరిగితే సంబంధిత సంఘాల ప్రతినిధులను బాధ్యులుగా చేస్తూ పనులు పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బీసీ కుల సంఘాల భవనాల నిర్మాణం, నిర్వహణ కోసం ప్రభుత్వం జీవో నంబర్ 14 ద్వారా కొత్త కార్యవర్గాల ఎంపికకు మార్గదర్శకాలు తీసుకొచ్చిందని తెలిపారు. నిర్మాణాలు ప్రభుత్వ నిర్దేశిత నిబంధనల ప్రకారం జరగాలని, భవనాలను బీసీ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, వసతి సౌకర్యాలు, గ్రంథాలయాలు, సామాజిక కార్యక్రమాలు, కుల సంఘాల అభ్యున్నతికి ఉపయోగించుకోవాలని సూచించారు. ఆర్థికంగా స్థోమత ఉన్న కుల సంఘాలు ప్రభుత్వం కేటాయించిన నిధులకు అదనంగా తమ వంతు సహకారం అందించాలని కోరారు. కుల సంఘాల ప్రతినిధులు అంతర్గత విభేదాలకు తావివ్వకుండా ఐక్యంగా ఉండి భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగరంలో, పెరిక , పద్మశాలి,

గౌడ, కాపు తదితర కుల సంఘాల వసతి గృహాల ద్వారా వేలాది మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగారని, అదే స్ఫూర్తితో ఇప్పుడు నిర్మించబోయే ఆత్మగౌరవ భవనాలు భవిష్యత్ తరాలకు విద్యా, సామాజిక అభివృద్ధి కేంద్రాలుగా నిలవాలని ఆకాంక్షించారు.

బీసీల అభ్యున్నతి, సామాజిక న్యాయం కాంగ్రెస్ ప్రభుత్వ విధానంలో అంతర్భాగమని, బీసీలకు సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రివర్గం, ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ తరఫున అన్ని బీసీ కుల సంఘాల ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు.వి.హనుమంతరావు, ప్రభుత్వ సలహాదారు మాట్లాడుతూ, బీసీ కుల సంఘాలన్నీ ఆత్మగౌరవ భవనాలను నిర్మించుకోవాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనను కార్యరూపంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేయడం బీసీ వర్గాల అభ్యున్నతిపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు.

రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా కులాల వారీగా తమ ప్రత్యేకతలను కాపాడుకుంటూనే అన్ని వర్గాలు ఐక్య భావనతో ముందుకు సాగాలని సూచించారు. బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరగాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన అని తెలిపారు. గతంలో ముదిరాజ్, మున్నూరు కాపు కులాలకు ఆత్మగౌరవ భవనాలు కేటాయించినట్లుగానే ఇప్పుడు ఇతర బీసీ కుల సంఘాలకు కూడా అవకాశం కల్పిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయానికి తోడు కులాల్లో ఆర్థికంగా స్థోమత ఉన్నవారు కూడా తమ వంతు సహకారం అందించి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు.

అన్నాచెల్లెలి అద్భుత విజయం.ఒకరు ఎంఎస్, మరొకరు ఎండీ

పీజీ వైద్య విద్యలో సత్తాచాటిన ఇద్దరు 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత





యాదాద్రి భువనగిరి, నవంబరు05/ట్రైనెట్ న్యూస్:

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టకు చెందిన అన్నాచెల్లెలు వైద్య విద్యలో అద్భుత ప్రతిభ చాటుకున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఐలేని విజయ్‌కుమార్ రెడ్డి, ఐలేని వీణ వైద్య విద్యలో పీజీ పూర్తి చేసి విజయాన్ని అందుకున్నారు. ఈ నెల 3న విడుదలైన పరీక్షా ఫలితాల్లో ఇద్దరూ 60 శాతం మార్కులు సాధించి ఉత్తీర్ణులయ్యారు. యాదగిరిగుట్ట పట్టణంలోని విజ్ఞాన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఐలేని రాంరెడ్డి, రమాదేవి దంపతుల కుమారుడైన విజయ్‌కుమార్ రెడ్డి ఎంఎస్ (జనరల్ సర్జరీ), కుమార్తె వీణ ఎండీ (జనరల్ మెడిసిన్) పూర్తి చేశారు. 2023లో నిర్వహించిన నీట్ పీజీ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వీరిద్దరూ అటల్ బిహారీ వాజపేయి మెడికల్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, లక్నోలో పీజీ సీట్లు పొందారు. మూడేళ్లపాటు వైద్య విద్యలో శిక్షణ పొందిన అనంతరం గత నెలలో పరీక్షలకు హాజరై తాజాగా విడుదలైన ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించారు. ఒకే కుటుంబం నుంచి అన్నాచెల్లెలు ఇద్దరూ వైద్య విద్యలో పీజీ పూర్తి చేసి వైద్య నిపుణులుగా ఎదగడం పట్ల యాదగిరిగుట్ట పట్టణవాసులు, పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లలను అభినందించగా, వారు విద్యాభ్యాసం చేసిన విజ్ఞాన్ హైస్కూల్ ఉపాధ్యాయ బృందం విజయ్‌కుమార్ రెడ్డి, వీణలను ఘనంగా సన్మానించింది.

సంత్ శిరోమణి గురు రవిదాస్ 650వ జయంతి సందర్భంగా "గ్రామ పెద్దల ఆత్మీయ సమ్మేళనం"





యాదాద్రి భువనగిరి,నవంబరు05/ట్రైనెట్ న్యూస్:

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల కేంద్రంలో సామాజిక సమరతా వేదిక యాదాద్రి భువనగిరి జిల్లా సంతోష్ శిరోమణి గురు రవిదాస్,650వ జయంతి సందర్భంగా ఆలేరు పట్టణ కేంద్రంలో శ్రీ రామకృష్ణ విశ్వవిద్యాలయంలో, గ్రామ పెద్దల ఆత్మీయ సమ్మేళనం జరిగింది.ఈ సమ్మేళన కార్యక్రమంలో రాష్ట్రీయ సేవా సంఘ నాయకులు, బండరాజుల శంకర్, అధ్యక్షతన జరిగింది.వారు మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ సామాజిక సమరసమర నేతర ఆధ్వర్యంలో గ్రామ పెద్దల ఆత్మీయుల సమ్మేళనం నిర్వహించామని,గ్రామాలలో అన్ని కులాలు అందరూ ఆదర్శంగా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.జిల్లా అధ్యక్షులు కెవి ప్రసాద్ గౌడ్, అనంతరం ఇతర కులాల నుండి సామాజిక కులాలు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు గ్రామ పెద్దలు,జనగాం శ్రీపాల్ రెడ్డి, కొల్లూరు మాజీ సర్పంచ్ గాజుల నరసయ్య యాదవ్,కొల్లూరు ఉపసర్పంచ్ గాజుల దశరథ,బండి వెంకటేష్, మాల సంఘం పెద్దలు దార బాలస్వామి,కొంత మురళి గౌడ్, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు అచ్చిన బిక్షం,కుమ్మరి సంఘం అధ్యక్షులు కట్కూరి రవి, గ్యాదపాక సుధాకర్, హరిజన సంఘం అధ్యక్షులు రేగళ్ల రాజు,వాటి సభ్యులు దార సురేష్,రేగళ్ల శ్రీనివాస్,రజక సంఘం నాయకులు,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.రాష్ట్రీయ సేవా సంఘ నాయకులు, పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలేరు మండలంలోని వివిధ గ్రామాల కుల కులసంఘ సభ్యులను, శాలువాతో సన్మానించారు.

సింగిల్ విండో డైరెక్టర్‌గా కొర్రావత్ పవన్ నాయక్..

- గిరిజన తండా బిడ్డకు కీలక బాధ్యత
- జేపల్లి గ్రామపంచాయతి వ్యాప్తంగా పండుగ వాతావరణం
- రైతు సేవే.. నా లక్ష్యం. ఎరువులు, విత్తనాలు కొరత లేకుండా నా వంతు కృషి చేస్తా :
- వెల్దండ సింగిల్ విండో డైరెక్టర్ కొర్రావత్ పవన్ నాయక్ వెల్లడి..



కల్వకుర్తి, ట్రైనెట్ న్యూస్ నవంబర్ 5 :

నాగర్‌కర్నూల్ జిల్లా, ఉమ్మడి వెల్దండ మండలం, జేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నెమలిగుట్టతాండకు చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కొర్రావత్ పవన్ నాయక్ వెల్దండ సింగిల్ విండో (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం – ప్యాక్స్) డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. నెమలిగుట్ట తాండ వంటి గిరిజన ప్రాంతం నుండి ఒక యువకుడికి సహకార రంగంలో ఈ కీలక బాధ్యతలు దక్కడంపై స్థానిక రైతాంగం, గ్రామ యువత, గిరిజన సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన డైరెక్టర్ కొర్రావత్ పవన్ నాయక్ మాట్లాడుతూ.. తనపై నమ్మకముంచి ఈ బాధ్యతను అప్పగించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి, ప్రభుత్వానికి, స్థానిక నాయకత్వానికి ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మండల పరిధిలోని రైతాంగ సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ వ్యవసాయ సబ్సిడీలు, రుణాలు, రాయితీలు అర్హులైన ప్రతి రైతుకు సకాలంలో అందేలా తన వంతు శాయశక్తులా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. రైతులకు అవసరమైన ఎరువులు, నాణ్యమైన విత్తనాల ను సింగిల్ విండో ద్వారా కొరత లేకుండా సరఫరా చేసేందుకు నిరంతరం అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. పవన్ నాయక్ ఎన్నికైనట్లు అధికారికంగా ప్రకటన వెలువడటంతో నెమలిగుట్ట తాండలో పండుగ వాతావరణం నెలకొంది. తాండ అభివృద్ధికి మరియు స్థానిక రైతుల అభ్యున్నతికి పవన్ నాయక్ నిరంతరం తోడ్పాటు నందిస్తారని స్థానిక పెద్దలు ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ ప్రజ లు, యువత, తాండ నివాసితు లు, గిరిజన యువకులు, మహిళలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

చైర్మన్ గా యెన్నం భూపతిరెడ్డి..

సింగిల్ విండో చైర్మన్ గా మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డిని నియమించగా, పవన్ నాయక్ తో పాటు 12 మందిని సింగిల్ విండో డైరెక్టర్లుగా నియమిస్తూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్ ఉత్త ర్వులు జారీ చేశారు.

కాలుష్యం కోరల్లో కందివనం..
ప్రజల ఆరోగ్యం, పంటలు, పాడి పశువులకు ముప్పు!

రెండు దశాబ్దాలుగా వాయు, జల కాలుష్యంతో గ్రామస్తుల అవస్థలు
కోర్టు ఆదేశాలు బేఖాతరు.. రెండు పరిశ్రమలను శాశ్వతంగా మూసివేయాలని గ్రామస్తుల డిమాండ్



హైదరాబాద్ , ట్రైనెట్ న్యూస్, నవంబర్ 5: రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలంలోని కందివనం గ్రామం కాలుష్య కోరల్లో చిక్కుకుంది. గ్రామ సమీపంలోని ఓం శివశక్తి స్పాంజ్ ఐరన్, సలాసర్ ఐరన్ పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో ప్రజల ఆరోగ్యాలు, వ్యవసాయ పంటలు, పాడి పశువులు తీవ్రంగా దెబ్బతింటున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రెండు దశాబ్దాలుగా సమస్య కొనసాగుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ మేరకు గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కందివనం గ్రామ వార్డ్ మెంబర్స్, ఉప సర్పంచ్ విజయ్లతో కలసి సర్పంచ్ జమిని మాట్లాడుతూ, 2004లో ఏర్పాటు చేసిన ఓం శివశక్తి స్పాంజ్ ఐరన్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న బొగ్గు, మట్టి, రాతి ధూళి గాలిలో కలిసి గ్రామం, పరిసర వ్యవసాయ పొలాలపై పడుతోందని తెలిపారు. పరిశ్రమ వ్యర్థ జలాలు భూగర్భ జలాల్లో కలవడంతో పాటు వర్షాల సమయంలో గ్రామంలోని పెద్ద చెరువులో చేరుతున్నాయని పేర్కొన్నారు. దీంతో చెరువులోని జలచరాలు చనిపోతున్నాయని, పశువులు అనారోగ్యానికి గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్యం కారణంగా పత్తి, మొక్కజొన్న, వరి, కూరగాయల పంటలు నల్లబడిపోయి దిగుబడులు, మార్కెట్ ధరలు తగ్గుతున్నాయని వాపోయారు. కలుషిత నీరు, గడ్డి తింటున్న పాడి పశువులు అనారోగ్యానికి గురవుతున్నాయని, పాల ఉత్పత్తి, పునరుత్పత్తి సామర్థ్యం తగ్గి చివరకు మరణిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు శ్వాసకోశ, చర్మ సంబంధిత వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. పరిశ్రమకు సమీపంలో ఉన్న పాఠశాల విద్యార్థులు సైతం కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పాఠశాల ఆవరణలో ఆరుబయట కూర్చొని భోజనం చేయలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఇళ్ల వద్ద బట్టలు ఆరబెట్టుకోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నామని వారు చెప్పారు. ఈ సమస్యపై పలుమార్లు కాలుష్య నియంత్రణ మండలి, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా శాశ్వత పరిష్కారం లభించలేదని ఆరోపించారు. గ్రామానికి చెందిన ఎల్కె రెడ్డి ఆధారాలతో ఫిర్యాదులు చేయడంతో నాలుగుసార్లు పరిశ్రమ కార్యకలాపాలు నిలిపివేయించినప్పటికీ యాజమాన్యం తీరు మారలేదని తెలిపారు. చెన్నైలోని గ్రీన్ ట్రిబ్యునల్ పరిశ్రమను ఏడాదిలోపు తొలగించాలని ఆదేశించినప్పటికీ అమలు కాలేదని ఆరోపించారు. ఇటీవల గ్రామస్తులంతా ఉద్యమించడంతో అధికారులు పరిశ్రమను తాత్కాలికంగా నిలిపివేసినా, కొంతకాలానికే తిరిగి ప్రారంభిస్తున్నారని మండిపడ్డారు. కందివనంతో పాటు పిట్లలగడ్డతండా, గుండెనాయక్‌తండా, దాస్యతండా, సిలుంబాయితండా, సాలోనికోల్ తదితర గ్రామాలు కూడా కాలుష్య ప్రభావానికి గురవుతున్నాయని తెలిపారు. ఓం శివశక్తి స్పాంజ్ ఐరన్‌తో పాటు సలాసర్ ఐరన్ పరిశ్రమను కూడా శాశ్వతంగా మూసివేయాలని, కాలుష్యం వల్ల నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోకపోతే సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముందు ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ యాదగిరి, లక్ష్మయ్య, రాజేష్ రెడ్డి, కృష్ణయ్య, ఎల్కే రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాల యజమానులకు పోలీసుల భద్రతా సూచనలు





చిలకలగూడ: రాబోయే దీపావళి పండుగను పురస్కరించుకుని చిలకలగూడ పోలీస్ స్టేషన్‌లో తాత్కాలిక బాణసంచా దుకాణాల యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

చిలకలగూడ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వి.రామకృష్ణ గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో బాణసంచా దుకాణాల నిర్వహణలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా దుకాణాల యజమానులు తప్పనిసరిగా అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని, అగ్నిప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశిత భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు.ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రజలందరూ భద్రతా నియమాలు పాటిస్తూ ప్రమాదరహితంగా దీపావళి పండుగను జరుపుకోవాలని చిలకలగూడ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

జల సంరక్షణతో పల్లెలకు ఉపాధి భరోసా

రాష్ట్రవ్యాప్తంగా భారీ కార్యక్రమానికి సన్నాహాలు
2027 జనవరి నుంచి జూన్ వరకు ప్రతి గ్రామంలో ఆరు నెలల కార్యాచరణ
చెరువులు, కుంటలు, వాగులు, కాలువలు, భూగర్భజల వనరుల పునరుజ్జీవానికి ప్రాధాన్యం
నీటిపారుదల,పంచాయతీరాజ్--గ్రామీణాభివృద్ధి శాఖల సంయుక్త అమలు
ఇప్పటికే 355 రకాల పనుల గుర్తింపు
అవసరమైన అదనపు నిధులను సమకూర్చనున్న రాష్ట్ర ప్రభుత్వం
-మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,

నవంబరు 5: జలవనరుల పునరుద్ధరణతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భారీ కార్యక్రమానికి సన్నాహాలు చేస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు 2027 జనవరి నుంచి జూన్ వరకు రాష్ట్రంలోని ప్రతి గ్రామాన్ని భాగస్వామ్యం చేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర సచివాలయంలో గురువారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్షలో మంత్రి మాట్లాడారు. రాబోయే వర్షాకాలానికి ముందుగా ఆరు నెలలపాటు చేపట్టే ఈ కార్యక్రమాన్ని నీటిపారుదల, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సంయుక్తంగా అమలు చేయనున్నట్లు చెప్పారు.

గ్రామస్థులను, ముఖ్యంగా వ్యవసాయ కూలీలను పెద్దఎత్తున భాగస్వాములను చేయాలని సూచించారు.

ఎల్‌నినో పరిస్థితుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ అవసరమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సవాలును అవకాశంగా మలుచుకొని దీర్ఘకాలం ఉపయోగపడే జలవనరుల ఆస్తులను సృష్టించాలని, ఇప్పటికే ఉన్న సాగునీటి మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలని చెప్పారు.

గ్రామీణ ఉపాధి కల్పనతోపాటు భూగర్భజలాల లభ్యతను మెరుగుపరచేలా పనుల ప్రణాళిక ఉండాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో చేపట్టేందుకు వీలుగా ఇప్పటికే 355 రకాల పనులతో సమగ్ర జాబితా సిద్ధమైందని మంత్రి తెలిపారు. స్పష్టమైన లక్ష్యం, తగిన ఆర్థిక వనరులు, గ్రామస్థాయిలో సమర్థవంతమైన అమలు ప్రధానాంశాలుగా కార్యక్రమాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించినట్లు పేర్కొన్నారు. నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి, భూగర్భజల, విద్యుత్ తదితర సంబంధిత శాఖల సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని వివరించారు.

ఉపాధి హామీ పథకాన్ని ప్రధానంగా వినియోగించుకుంటూ ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అమలులో ఉన్న 60:40 నిధుల నిష్పత్తికి అనుగుణంగా పనులను రూపొందించడంతోపాటు అవసరమైన చోట రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సహకారం అందిస్తుందని చెప్పారు. కార్యక్రమం అమలుకు అవసరమయ్యే అదనపు నిధులను రాష్ట్ర ప్రభుత్వమే సమకూరుస్తుందని భరోసా ఇచ్చారు. ఇప్పటికే ఉన్న నీటి వనరుల పునరుద్ధరణ, పునరుజ్జీవమే కార్యక్రమానికి ప్రధాన ప్రాధాన్యంగా ఉంటుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు.

చిన్ననీటి పారుదల చెరువులు, గ్రామాల్లోని కుంటలు, చెరువులకు నీటిని చేర్చే కాలువలు, సాగునీటి కాలువల్లో పూడిక తొలగింపు చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. సంప్రదాయ జలసేకరణ నిర్మాణాల పునరుద్ధరణను కూడా ఇందులో భాగం చేయాలన్నారు.

దెబ్బతిన్న తూములు, గేట్ల మరమ్మతులు, పేరుకుపోయిన పూడిక తొలగింపు, పిచ్చిమొక్కలు, ముళ్లపొదల తొలగింపు, చెరువుల నిర్మాణాల మరమ్మతులు వంటి పనులను చేపట్టడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని చెప్పారు. అందుబాటులో ఉన్న జలవనరులను సమర్థంగా వినియోగించుకునేలా పనులను ఎంపిక చేయాలని సూచించారు. నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి శాఖల సమన్వయంతో పొలాలకు నీటిని చేర్చే పంటకాలువల నిర్మాణం చేపడితే ప్రస్తుతం ఉన్న సాగునీటి సదుపాయాల వినియోగం గణనీయంగా మెరుగుపడుతుందని మంత్రి పేర్కొన్నారు. తద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.

చిన్న నదులు, వాగులు, స్థానిక జలప్రవాహాలపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణ అంశాన్ని కూడా సమావేశంలో చర్చించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భజలాల పునర్భరణకు దోహదపడేలా, స్థానికంగా నీటి లభ్యతను పెంచేలా ఈ పనులను పరిశీలించాలని మంత్రి సూచించారు. భూగర్భజలాల పెంపుదల కోసం రాజస్థాన్, మహారాష్ట్రల్లో చేపట్టిన విజయవంతమైన కార్యక్రమాలను అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ పరిస్థితులకు అనువైన విధానాలను గుర్తించి కార్యాచరణలో పొందుపరచాలని చెప్పారు. భూగర్భజలాల పరిస్థితి, ప్రస్తుతం చేపడుతున్న చర్యలు, భవిష్యత్తు అవసరాలపై సమీక్షించేందుకు జిల్లా స్థాయి భూగర్భజల శాఖ అధికారులతో త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేలా ఈ కార్యక్రమానికి ఆకర్షణీయమైన పేరు సూచించాలని మంత్రి అధికారులను కోరారు. వివిధ శాఖలు చేపట్టే పనులన్నింటినీ ఒకే కార్యక్రమం కింద సమన్వయం చేసేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రభుత్వ నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ. శ్రీధర్, పంచాయతీరాజ్ కమిషనర్ డి. దివ్య, నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) ఓ.వి. రమేష్‌బాబు, మిషన్ భగీరథ ఈఎన్‌సీ జి. కృపాకర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్, భూగర్భజల శాఖ డైరెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా తెలంగాణ ఇన్వెస్ట్ సమ్మిట్

డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో సమ్మిట్
రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, క్లైమేట్ కాంక్లేవ్‌లకు ప్రత్యేక ఏర్పాట్లు



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 5:

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026 ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించనున్న సమ్మిట్ ఏర్పాట్ల పురోగతిని అధికారులు వివరించారు. సమ్మిట్ వేదిక, వివిధ హాల్స్, అంతర్జాతీయ ప్రతినిధుల ఆహ్వానాలు, కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మంత్రులకు, అధికారులకు పలు సూచనలు చేశారు.

గ్లోబల్ సమ్మిట్‌కు హాజరయ్యే ప్రతి ప్రతినిధికి ఒక లైజనింగ్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రతినిధులు విమానాశ్రయానికి చేరుకున్న వెంటనే రిజిస్ట్రేషన్, పాస్‌ల జారీ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. సమ్మిట్‌కు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ముందుగానే ప్రతినిధులకు అందజేయాలన్నారు. సదస్సుకు వచ్చే ప్రముఖులు, అన్ని రంగాల ప్రతినిధులకు వేదికలోకి ప్రవేశించినప్పటి నుంచి తిరిగి వెళ్లే వరకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.

సమ్మిట్‌లో ప్రతి విభాగానికి ప్రత్యేక అధికారితోపాటు భద్రతా అధికారిని నియమించాలని సీఎం సూచించారు. గ్లోబల్ సమ్మిట్‌కు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా సమ్మిట్‌కు ఆహ్వానించాలని సూచించారు. పెట్టుబడి ఒప్పందాలు చేసుకునేందుకు, పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే కంపెనీల ప్రతినిధులకు ప్రత్యేక ఆహ్వానాలు అందించాలన్నారు. నవంబర్ 15 నాటికి సమ్మిట్ ఏర్పాట్ల పూర్తి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత ఏడాది తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌తో పోలిస్తే ఈసారి మరింత విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గతంలో ఒక ఎక్స్‌పో హాల్ ఉండగా ఈసారి ఆరు ప్రదర్శనశాలలు ఏర్పాటు చేస్తున్నారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఆధునిక సాంకేతికత, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యమిస్తూ సమ్మిట్ కార్యక్రమాలను రూపొందించారు. సమ్మిట్‌లో భాగంగా రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, స్టార్టప్ పెవిలియన్, ఫార్మా అండ్ లైఫ్ సైన్సెస్ ఎక్స్‌పో, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రదర్శన, తెలంగాణ పెవిలియన్, ఎడ్యుకేషన్ ఎక్స్‌పో, క్లైమేట్ కాంక్లేవ్‌ల ఏర్పాట్లను అధికారులు వివరించారు. రక్షా ఎక్స్‌పోలో రక్షణ, ఏరోస్పేస్, అంతరిక్షం, సైబర్ సెక్యూరిటీ రంగాలకు చెందిన ఆధునిక పరికరాలు, డ్రోన్లు, రోబోటిక్స్ ప్రదర్శించనున్నారు. వైమానిక విన్యాసాలు కూడా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రక్షా ఎక్స్‌పోలో పాల్గొనేందుకు 575 సంస్థలను ఆహ్వానించగా, ఇప్పటివరకు 49 సంస్థలు ముందుకు వచ్చాయి. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగాలకు సంబంధించి ఇండియా జాయ్--2026 నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. స్టార్టప్‌ల కోసం ప్రత్యేక పెవిలియన్ ఏర్పాటు చేసి 136 స్టార్టప్‌ల ఆవిష్కరణలను ప్రదర్శించేలా ప్రణాళిక రూపొందించారు. తెలంగాణ ఇన్నోవేషన్ స్టార్టప్ ఛాలెంజ్‌లో భాగంగా వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ప్రజా మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను ఆహ్వానిస్తున్నారు. ఇందుకు నవంబర్ 20 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాలకు సంబంధించి 60 కంపెనీల ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల పెవిలియన్‌లో ఆధునిక సాగు పద్ధతులు, వ్యవసాయ డ్రోన్లు, పాడి, మత్స్య, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, చేనేత, బతుకమ్మ, కాకతీయుల శిల్పకళతోపాటు రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలను ప్రతిబింబించేలా ప్రత్యేక తెలంగాణ పెవిలియన్ ఏర్పాటు చేస్తున్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో పర్యాటక రంగానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. తెలంగాణలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ ప్రతినిధులను ఆకట్టుకునేలా ప్రదర్శించాలన్నారు. విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి సంబంధించి ప్రత్యేక ఎడ్యుకేషన్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నారు. 'నర్సరీ నుంచి ఆక్స్‌ఫర్డ్ వరకు' తెలంగాణ విద్యారంగం ప్రతిబింబించేలా గ్లోబల్ సమ్మిట్‌లో చర్చలు జరగాలని సీఎం సూచించారు. మూడు రోజుల సమ్మిట్‌లో నాలుగు ప్రధాన హాళ్లలో 52 రంగాలవారీ సమావేశాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు అధికారులు తెలిపారు.

సమ్మిట్ నిర్వహణ కోసం 25 రంగాలవారీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేశారు. దాదాపు 3,500 ఆహ్వానాలను పంపించారు. అంతర్జాతీయ ప్రతినిధుల ఆహ్వానాలు, వసతి, ప్రోటోకాల్, భద్రత, ప్రదర్శనల నిర్వహణ కోసం పది అధికారుల కమిటీలను ఏర్పాటు చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, డి. శ్రీధర్ బాబు, గడ్డం వివేక్ సభ్యులుగా ఉన్న మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాట్ల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సీఎం సూచించారు.

ఎల్‌నినో సవాళ్లపై తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్

ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే వాతావరణ మార్పులు, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు డిసెంబర్ 8న ప్రత్యేకంగా తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్ నిర్వహించనున్నారు. ఈ సదస్సులో దాదాపు 200 మంది శాస్త్రవేత్తలు, రైతులు, వివిధ రంగాల నిపుణులు పాల్గొననున్నారు. కరువును తట్టుకునే వ్యవసాయం, పశుసంరక్షణ, తాగునీటి భద్రత, అధిక ఉష్ణోగ్రతల నుంచి రక్షణ, అడవులు, జీవవైవిధ్య పరిరక్షణ, వ్యర్థాలను సంపదగా మార్చడం వంటి ఐదు ప్రధాన అంశాలపై చర్చించనున్నారు. వాతావరణ మార్పులపై గ్లోబల్ సమ్మిట్‌లో ప్రత్యేకంగా చర్చ జరగాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇప్పటికే వాతావరణ మార్పుల కారణంగా ఎదురవుతున్న సమస్యలను గుర్తించి తక్షణ చర్యలతోపాటు దీర్ఘకాలిక పరిష్కారాలను రూపొందించాలన్నారు. రాష్ట్రంలో కరువు, వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించే దిశగా ఈ సదస్సు నిర్ణయాత్మక పాత్ర పోషించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో సీఎం, డిప్యూటీ సీఎం తోపాటు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి సలహాదారు కె. రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, గ్లోబల్ సమ్మిట్ అధికారుల కమిటీల సభ్యులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బాణసంచా బాధిత చిన్నారులకు 'వాసన్' అభయం.

●15 ఏళ్లలోపు పిల్లలకు ఉచిత నేత్ర వైద్యం.. అవసరమైతే శస్త్రచికిత్సలు సైతం ఉచితం.





దీపావళి వేళ బాణసంచా కాల్చుతూ ప్రమాదవశాత్తూ కంటి గాయాల బారినపడే చిన్నారులకు అండగా నిలిచేందుకు ప్రముఖ నేత్ర వైద్య సంస్థ వాసన్ ఐ కేర్ మానవతా దృక్పథంతో ముందుకొచ్చింది. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా 'సేఫ్ ఐస్.. సేఫ్ దీపావళి' కార్యక్రమాన్ని చేపట్టి, 15 ఏళ్లలోపు పిల్లలకు ఉచిత నేత్ర వైద్య సేవలు అందించనున్నట్లు ప్రకటించింది.ఏఎస్ రావు నగర్‌లోని వాసన్ ఐ కేర్ ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన సమావేశంలో డాక్టర్ సుధీర్ చీమకుర్తి, డాక్టర్ సౌమ్య ఐఆర్, బ్రాంచ్ మేనేజర్ ఫాతిమా అంజుమ్ మాట్లాడుతూ.. నవంబర్ 4 నుంచి 14వ తేదీ వరకు వాసన్ ఐ కేర్, ఏఎస్‌జీ ఐ హాస్పిటల్ కేంద్రాల్లో ఈ ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. బాణసంచా కారణంగా కంటికి గాయాలైన చిన్నారులకు అత్యవసర వైద్యం, ప్రథమ చికిత్స, ఉచిత మందులతో పాటు అవసరమైన సందర్భాల్లో శస్త్రచికిత్సలను సైతం ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. బాధితులకు అత్యవసర వైద్య మార్గదర్శకత్వం, సమీప ఆసుపత్రుల వివరాల కోసం 1800 5713 333 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చని సూచించారు. గత ఏడాది దీపావళి సందర్భంగా 500 మందికి పైగా చిన్నారులకు ఈ తరహా సేవలు అందించినట్లు గుర్తుచేశారు.

భద్రతా జాగ్రత్తలు తప్పనిసరిదీపావళి వేడుకల్లో బాణసంచా కాల్చేటప్పుడు తగినంత సురక్షిత దూరం పాటించాలని, రక్షణ కళ్లద్దాలు ధరించాలని, పేలని టపాసుల వద్దకు వెళ్లకూడదని వైద్యులు సూచించారు. ప్రమాదవశాత్తూ కంటికి గాయమైతే

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026ను దేశంలోనే అతిపెద్ద ఇండస్ట్రియల్ ఎక్స్‌పోగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు

-ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్ ,

నవంబర్ 5: హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026ను దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రదర్శనగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఈ సమ్మిట్ నిర్వహణకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లు, వివిధ కార్యక్రమాల పురోగతిపై గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రభుత్వ కార్యదర్శులు ఇలంబర్తి, హరిచందన, గౌరవ్ ఉప్పల్, దివ్య దేవరాజన్, శశాంక, అనుదీప్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని ప్రముఖ పారిశ్రామిక సంస్థలు, కంపెనీలను ఆహ్వానించామని, ఇప్పటికే అనేక సంస్థలు తమ భాగస్వామ్యానికి సంసిద్ధత వ్యక్తం చేశాయని తెలిపారు. సమ్మిట్ నిర్వహణపై తాము ఆశించిన దానికంటే అధికంగా స్పందన లభిస్తోందని పేర్కొన్నారు.

ఈ సమ్మిట్‌లో భాగంగా రక్షా ఎక్స్‌పో, స్టార్టప్ పెవిలియన్, క్రియేషన్ కార్నర్, ఫార్మా--లైఫ్ సైన్సెస్ ఎక్స్‌పో, తెలంగాణ పెవిలియన్, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో, తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్, ఎడ్యుకేషన్ సమ్మిట్, ఏరోబాటిక్--ఎయిర్ షో తదితర ప్రత్యేక ప్రదర్శనలు, కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. ముఖ్యంగా స్టార్టప్ పెవిలియన్, క్రియేషన్ కార్నర్ యువత, జెన్-జీ (+వఅ ్గ)లోని సృజనాత్మకత, ఆవిష్కరణలు, నూతన ఆలోచనలకు ప్రోత్సాహం అందించే వేదికలుగా నిలుస్తాయని తెలిపారు. సమ్మిట్‌ను సమర్థవంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల సమన్వయంతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణం, మౌలిక సదుపాయాలు, వ్యాపార అవకాశాలను జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు వివరించి, వారిని రైజింగ్ తెలంగాణ విజన్ లో భాగస్వాములను చేయడమే ఈ సమ్మిట్ ప్రధాన లక్ష్యమని సీఎస్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే హైదరాబాద్‌తో పాటు న్యూఢిల్లీలో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026 కర్టెన్ రైజర్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. సమ్మిట్‌లో పాల్గొనే ప్రతినిధుల కోసం డెలిగేట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా ప్రారంభించినట్లు వెల్లడించారు.

తెలంగాణ ఉద్యమకారుడు లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి సీఎం రేవంత్ రెడ్డి భరోసా

రూ.5 లక్షల తక్షణ ఆర్థిక సాయం..
కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, పిల్లల చదువుల బాధ్యత ప్రభుత్వానిదే



బచ్చన్నపేట, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 5:

తెలంగాణ ఉద్యమకారుడు, జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన లక్ష్మణ్ గౌడ్ అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడటం తీవ్ర విషాదాన్ని నింపింది. ఉద్యమంలో కీలకంగా పాల్గొన్న వ్యక్తి ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడం పట్ల పలువురు నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం ప్రభుత్వ విప్ వేముల వీరేశం, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, ఎమ్మెల్సీ, మండలి ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ లక్ష్మణ్ గౌడ్ నివాసానికి వెళ్లారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం తరపున లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి రూ.5 లక్షల తక్షణ ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. అంతేకాకుండా కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించడం, పిల్లల చదువుల పూర్తి బాధ్యత తీసుకోవడంపై ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న లక్ష్మణ్ గౌడ్ మరణం తీరని లోటని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబం ఒంటరిది కాదని, ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా అండగా నిలుస్తాయని భరోసా ఇచ్చారు. ఉద్యమకారుల త్యాగాలను ప్రభుత్వం గుర్తిస్తుందని, కష్టకాలంలో వారి కుటుంబాలకు అండగా ఉండటం తమ బాధ్యత అని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా అస్మిత రగ్బీ పోటీల విజేతలు మెదక్, ఖమ్మం

ఈ నెల 3,4,5 తేదీలలో సంగారెడ్డి జిల్లా వోక్సన్ యూనివర్సిటీ గ్రౌండ్ లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 15 బాలికల అస్మిత రగ్బీ పోటీలలో ఖమ్మం,నిజామాబాద్,యాదాద్రి భువనగిరి, జగిత్యాల,కరీంనగర్, వనపర్తి, మహబూబాబాద్, మంచిర్యాల,నల్గొండ, జనగాం,పెద్దపల్లి, మేడ్చల్, మెదక్, వరంగల్,హైదరాబాద్,సిద్దిపేట తో సహా 16 జిల్లాలు పాల్గొనగా మొదటి స్థానం ఖమ్మం,రెండవ స్థానం నల్గొండ ,మూడవ స్థానం వనపర్తి సాధించింది.అండర్ 18 విభాగంలో
ఖమ్మం,వరంగల్,ఆసిఫాబాద్,కరీంనగర్,జనగాం,మహబూబాబాద్,నల్గొండ,వనపర్తి,పెద్దపల్లి,

ఒంటిమిట్టలో స్వల్ప ఘర్షణలు మినహా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం

- పార్టీ విధేయత కంటే వ్యక్తిగత సమీకరణాలకే ప్రాధాన్యం..
- ఓటర్లను ఆకట్టుకునేందుకు నేతల విభిన్న వ్యూహాలు
- చింతరాజుపల్లి, రాచపల్లిలో స్వల్ప ఘర్షణలు.. పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన ఉద్రిక్తత
- 17 పోలింగ్ స్టేషన్లు.. 30 బూతులు.. 80 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు
- 52. 8 8 శాతం పోలింగ్





ఒంటిమిట్టమండలంలో జరిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల స్వల్ప ఘర్షణ మినహా ప్రశాంతంగా జరిగాయి 13324 ఓట్లు పోలై పోలింగ్52.88 శాతం జరిగింది మరికొంత కష్టంగా సాగింది. ఒకవైపు పార్టీల మధ్య ఆధిపత్య పోరు, మరోవైపు గ్రామాల్లో వ్యక్తిగత సంబంధాలు, స్థానిక రాజకీయ సమీకరణాలు ఎన్నికల సరళిని ప్రభావితం చేశాయి. అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు అనుసరించిన వ్యూహాలు, ఓటర్లను అభ్యర్థించిన తీరు పలుచోట్ల ఆసక్తికర చర్చకు దారితీశాయి. మొత్తంగా ఈ ఎన్నికల్లో పార్టీ గుర్తులకే కాకుండా వ్యక్తిగత ప్రయోజనాలు, స్థానిక పరిచయాలు కూడా కీలకంగా మారాయి.

ఒక ఓటు జెడ్పీటీసీకి.. మరో ఓటు ఎంపీటీసీకి!

ఎన్నికల ప్రచారంలో కొన్ని గ్రామాల్లో నాయకులు అనుసరించిన వ్యూహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొన్ని చోట్ల జెడ్పీటీసీ అభ్యర్థికి తమ పార్టీకి ఓటు వేయాలని, ఎంపీటీసీ అభ్యర్థి విషయంలో మాత్రం ఓటర్ల ఇష్టానికే వదిలేస్తున్నామని చెప్పడం కనిపించింది. మరికొన్ని ప్రాంతాల్లో ఎంపీటీసీ స్థానానికి తమ అభ్యర్థికి ఓటు వేయాలని, జెడ్పీటీసీ విషయంలో మీ నిర్ణయమే తుది నిర్ణయమని కోరారు. దీంతో ఒకే పార్టీకి చెందిన అభ్యర్థులకు రెండు స్థానాల్లో ఒకే విధంగా ఓట్లు పడతాయా? లేక ఓటర్లు తమకు నచ్చిన వ్యక్తులను వేర్వేరుగా ఎన్నుకుంటారా? అన్న చర్చ గ్రామాల్లో సాగింది.

పార్టీ కంటే వ్యక్తిగత సమీకరణాలే కీలకం!

ఈ ఎన్నికల్లో కొన్ని గ్రామాల్లో రాజకీయ పార్టీల బలాబలాల కంటే వ్యక్తిగత సంబంధాలు, స్థానికంగా ఉన్న పరిచయాలు, గ్రామాల్లోని వర్గ సమీకరణాలు ఎక్కువగా ప్రభావం చూపినట్లు కనిపించాయి. ఎవరికి వారు తమకు అనుకూలమైన అభ్యర్థుల గెలుపు కోసం ప్రయత్నాలు చేశారు. పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇస్తూనే మరో స్థానంలో తమకు అనుకూలమైన వ్యక్తికి ఓటు వేయాలని కోరిన సందర్భాలు కూడా కనిపించాయి. దీంతో ఎన్నికల పోరు కేవలం పార్టీల మధ్య పోటీగా కాకుండా వ్యక్తుల మధ్య పోటీగా కూడా మారింది.

చింతరాజుపల్లి, రాచపల్లిలో స్వల్ప ఘర్షణలు

పోలింగ్ సందర్భంగా చింతరాజుపల్లి, రాచపల్లి గ్రామాల్లో స్వల్ప ఘర్షణలు చోటుచేసుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎన్నికల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య చోటుచేసుకున్న వివాదాలు ఉద్రిక్తతకు దారితీశాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఇరువర్గాలను అదుపు చేసి ఘర్షణలు మరింత తీవ్రతరం కాకుండా చర్యలు చేపట్టారు. పోలీసుల జోక్యంతో పరిస్థితి సద్దుమణగడంతో పోలింగ్ ప్రక్రియ కొనసాగింది.

17 పోలింగ్ స్టేషన్లు.. 30 పోలింగ్ బూతులు

మండలవ్యాప్తంగా మొత్తం 17 పోలింగ్ స్టేషన్లు, 30 పోలింగ్ బూతులను ఏర్పాటు చేసి ఎన్నికల నిర్వహణ చేపట్టారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. 11 గంటలకి 30.64శాతం పోలింగ్ నమోదయింది

80 మంది పోలీసులతో నాలుగు రూట్లలో బందోబస్తు

ఎన్నికల భద్రత కోసం పోలీసు శాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. మొత్తం 80 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తుకు వినియోగించగా, ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్ఐలు విధుల్లో పాల్గొన్నారు. మండలాన్ని నాలుగు రూట్లుగా విభజించి ఆయా ప్రాంతాల్లో పోలీసు బృందాలు నిరంతరం పర్యటిస్తూ పరిస్థితిని పర్యవేక్షించాయి. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నారు.

తొమ్మిది ఎంపీటీసీ స్థానాలు.. ఆరింటిలో పోరు!

ఒంటిమిట్ట మండలంలో మొత్తం తొమ్మిది ఎంపీటీసీ స్థానాలు ఉండగా, వాటిలో మూడు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన ఆరు స్థానాల్లో అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచి తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. కొత్తమాదవరం ఎంపీటీసీ స్థానంలో టీడీపీ అభ్యర్థి, స్వతంత్ర అభ్యర్థి మధ్య పోటీ నెలకొనగా.. గంగపేరూరు స్థానంలో జనసేన, వైసీపీ అభ్యర్థుల మధ్య ప్రధాన పోరు కొనసాగింది. మిగిలిన స్థానాల్లో టీడీపీ, వైసీపీ అభ్యర్థుల మధ్య పోటీ నెలకొంది.

ఎవరి లెక్కలు వారివే.. ఫలితాలపై ఉత్కంఠ!

ఎన్నికలు ఇంకా జరుగుతుండటంతో అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులు తమకు అనుకూలంగా ఓట్లు పడుతున్నాయని లెక్కలు వేసుకుంటున్నారు. గ్రామాల్లో జరిగిన రాజకీయ పరిణామాలు, వ్యక్తిగత సమీకరణాలు, ఓట్ల విభజన ఎవరికి కలిసివస్తాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. పార్టీ అభ్యర్థుల బలాబలాలతో పాటు స్వతంత్ర అభ్యర్థుల ప్రభావం కూడా ఫలితాలపై ఎలా ఉంటుందన్న చర్చ సాగుతోంది.

మొత్తానికి ఒంటిమిట్ట మండలంలో ఈ ఎన్నికలు 'పార్టీకి ఒక ఓటు.. వ్యక్తికి మరో ఓటు' అన్న తరహాలో ఆసక్తికరంగా సాగాయి. ప్రచారంలో వేసిన రాజకీయ ఎత్తుగడలు, పోలింగ్‌లో ఓటర్లు తీసుకున్న నిర్ణయాలు చివరకు ఎవరికి విజయాన్ని అందిస్తాయో తెలియాలంటే ఫలితాల వరకు వేచి చూడాల్సిందే!

ప్రజలకు డాక్టర్లు మెరుగైన వైద్యశీ అందించాలి



డాక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్యారోగ్య జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ కుమార్ నాయక్ పేర్కొన్నారు గురువారం స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రులు ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు ఓపి రికార్డులు కాన్పుల గదులు రక్త నమోనా ఎక్స్రే గదులు నాయన పరిశీలించి డాక్టర్ తో మాట్లాడారు లక్కిరెడ్డిపల్లి మండలం చాలా మారుమూల ప్రాంతమని ఇక్కడికి చాలామంది పేద ప్రజలు ఆసుపత్రికి వస్తారని డాక్టర్లు అన్ని వేళల్లో అందుబాటులో ఉండి సమయాపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు అలాగే హాస్పిటల్లో తానుపులు తప్పనిసరిగా చేయించాలన్నారు వచ్చిన రోగులకు మూడు పూటలా ఆరోగ్యకరమైన భోజనాలను ఏర్పాటు చేయాలన్నారు ఆసుపత్రికి రోగి ఏ సమయానికి వచ్చినా చికిత్సలు నిర్వహించాలన్నారు ఆసుపత్రిలో పరిశుభ్రతగా ఉంచాలని రోగులు గదులు ఎప్పటికీ శుభ్రం చేసి బెడ్లపైన బెడ్ షీట్లు మార్చాలన్నారు కచ్చితంగా కాన్పులు ఆసుపత్రిలో చేయించి సురక్షితంగా తల్లి బిడ్డను ఇంటికి చేర్చాలన్నారు ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ ఎన్ఎస్ ప్రసాద్ డాక్టర్లు కీర్తి రెడ్డి, సులోచన, దేవి ప్రశాంతి , శివప్రసాద్, స్టాఫ్ నర్సులు సిబ్బంది పాల్గొన్నారు

అల్లూరి జిల్లా లో

ప్రశాంతంగా ముగిసిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్

పాడేరు అల్లూరి సీతారామరాజు జిల్లాలో,జెడ్పీటీసీ ఎంపీటీసీ, ఎన్నికల పోలింగ్ ప్రక్రియ



ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించబడింది.
పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులతో ఎన్నికల సిబ్బంది పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రానికి చేరుకుంటున్నారు. ఎన్నికల సిబ్బంది నుంచి బ్యాలెట్ బాక్సులను అధికారులు స్వీకరించి, భద్రపరిచేందుకు అవసరమైన ఏర్పాట్లు చే పట్టారు అల్లూరి జిల్లా 11మండలాలలో, 11జడ్పీటీసీ స్థానాలు, 172,ఎంపీటీసీ స్థానాలు ఉన్నఅల్లూరి జిల్లా లో
అన్ని చోట్లా పోలీస్, వైద్య ప్రజలు ప్రజా ప్రతినిధులు, సంబందించిన అధికారులు అందరు సహా కారముతో ప్రశాంతంగాముగిసిన స్థానిక ఎన్నికలపోలింగ్.

ఎంపీపీగా కాగితకే పట్టాభిషేకం...

గుడ్లవల్లేరు మండల అభివృద్ధి కాంక్షించే మాజీ సర్పంచి కాగిత నరేంద్ర నాయకత్వాన టీడీపీ ఎంపీపీగా అభ్యర్థి కాగిత ఉమకే పట్టాభిషేకం చేసుకునేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఆమెకు పురిటిపాడు ఎంపీటీసీ సెగ్మెంట్‌లోని ఓటర్లు తమ ఓట్లతో గెలిపించేందుకు గురువారం జరిగిన ఎన్నికల్లో భారీ ఎత్తున తరలి వచ్చారు. పురిటిపాడు సెగ్మెంట్‌లో టీడీపీ అభ్యర్థి ఉమకు సైకిల్ గుర్తుకు ఆమెతో పాటు జెడ్పీటీసీ అభ్యర్థి వర్రె బలరామకష్ణకు గాజుగ్లాసు గుర్తుకు రెండు ఓట్లను వేశామని ఆ ప్రాంత ఓటర్లు చెబుతున్నారు.



కల్యాణపు నవాబుకే ఓటర్ల మొగ్గు....

అన్ని వర్గాల ఓటర్లు జనసేన కూరాడ ఎంపీటీసీ అభ్యర్థి కల్యాణపు నవాబుకే మొగ్గు చూపారు. గురువారం జరిగిన ఎన్నికల్లో శ్రీ కొండలమ్మ ఆలయ చైర్మన్ ఈడే మోహన్, కూటమి నాయకులు బాసా రాంబాబు, శీరం రమేష్ వంటి కూటమి నాయకులు బలపరిచిన కూరాడ సెగ్మెంట్‌లో జనసేన అభ్యర్థి నవాబుతో పాటు జెడ్పీటీసీ అభ్యర్థి వర్రె బలరామకష్ణకు గాజు గ్లాసు గుర్తుకు రెండు ఓట్లను వేశామని ఆ ప్రాంత ఓటర్లు చెబుతున్నారు.



కించాయిపుట్టు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని పరిశీలించిన జిల్లా ఎన్నికల పరిశీలకులు

జోల పుట్టు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎన్నికల పరిశీలకులు శ్రీ రోణంకి కూర్మనాథ్, ఐఏఎస్ జిల్లాలో జరుగుతున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించారు.ఈ సందర్భంగా జోలాపుట్టు, కించాయిపుట్టు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పించిన సౌకర్యాలు, ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా జరిగేలా అధికారులకు సూచనలు చేశారు.





జారీ చేసినవారు:
జిల్లా పౌర సంబంధాల అధికారి (డీపీఆర్ ఓ),
అల్లూరి సీతారామరాజు జిల్లా.

భద్రాద్రి డీఏవీ పాఠశాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు.

-- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మౌలిక సదుపాయాలు, బోధనా విధానాలు



తెలంగాణ జెన్‌కో పరిధిలోని వివిధ డీఏవీ విద్యాలయాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం బుధవారం భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ టౌన్‌షిప్‌లోని డీఏవీ ఉన్నత పాఠశాలను సందర్శించింది. ఈ సందర్భంగా పాఠశాలలోని అత్యాధునిక భవనం, కంప్యూటర్ ప్రయోగశాల, విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాల, విశాలమైన క్రీడా మైదానం, వాహనాల పార్కింగ్ సదుపాయాలను పరిశీలించింది.
చీఫ్ ఇంజనీర్ బిచ్చన్న సారథ్యంలో, ఎస్ఈ (సివిల్), ఎస్ఈ (అడ్మిన్) పర్యవేక్షణలో పాఠశాల అభివృద్ధికి చేపట్టిన పనులను బృందం అభినందించింది. జాతీయస్థాయి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఇక్కడి బోధనా విధానాలు, మౌలిక సదుపాయాలు ఉన్నాయని, ఇవి ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తాయని కొనియాడింది.వచ్చే విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ పాఠ్యప్రణాళిక అమలులోకి రానుండటం భద్రాద్రి ఉద్యోగుల పిల్లలకు మంచి అవకాశమని పేర్కొంది. పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేసిన చీఫ్ ఇంజనీర్ బిచ్చన్నను బృంద సభ్యులు ఘనంగా సన్మానించి అభినందించారు.

భాదిత యువకుడికి భరోసా కల్పించిన ఎమ్మెల్యే పాయం.

పినపాక మండల పరిధిలోని పోట్లపల్లి గ్రామపంచాయతీ గడ్డిగూడెం గ్రామానికి చెందిన బడే కృష్ణ కుమారుడు బడే జస్వంత్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



బాధితుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా జస్వంత్ ఆరోగ్య పరిస్థితిని, కుటుంబ సభ్యుల ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు.
అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న యువకుడికి మనోధైర్యం కల్పిస్తూ, కుటుంబ సభ్యులు ఆందోళన చెందవద్దని సూచించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం భరోసా ఇచ్చారు.
కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని, జస్వంత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే పరామర్శతో బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం కలిగింది. బూర్గంపాడు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తోలెం కళ్యాణి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గోడిశాల రామనాధం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పేరం వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వై ఏసుబాబు, మాజీ ఎంపీపీ పడిగ నాగయ్య, మాజీ వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, జిల్లా దిశా కమిటీ సభ్యుడు, పోట్లపల్లి సర్పంచ్ మద్దెల సమ్మయ్య, ప్రజాప్రతినిధులు తోలెం స్వప్న, అచ్చా నవీన్, కంది విజయ్ భరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మా మద్దతు నాగేశ్వరరావు కే : వెంకట కృష్ణ గౌడ్



పశువేముల గ్రామ సర్పంచ్ అభ్యర్థి గా నిలబడుతున్న దోసపాటి నాగేశ్వరరావు కే తమ మద్దతు అని గ్రామ టీడీపీ నాయకులు పి.వెంకట కృష్ణ గౌడ్ తెలిపారు. కష్ట కాలంలో పార్టీ కి, ప్రజలకు అండగా నిలిచిన నాగేశ్వరరావు కే తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని వెంకట కృష్ణ గౌడ్ అన్నారు.

15వ వార్డు కౌన్సిలర్ తమ్మిశెట్టి ఏడుకొండలు ఘన విజయం

మాచర్ల పట్టణం లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 15వ వార్డు తమ్మిశెట్టి ఏడుకొండలు ఘన విజయం సాధించారు. ఈ వార్డు లో పోలైన మొత్తం ఓట్లు 695 కాగా,
వైసీపీకి 66, ఇతరులకి 1 రాగా, చెల్లనీ ఓట్లు 25 కాగా,
నోటాకి 6 వచ్చాయి. ఇందులో టిడిపి కి మెజార్టీ 867 ఓట్లు వచ్చాయి.



పర్యావరణ కట్టుబాట్లే దేశాభివృద్ధికి చోదకశక్తులు

స్వచ్ఛ ఇంధన పరివర్తన ప్రజా ఉద్యమంగా మారాలి: ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 5:

పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కట్టుబాట్లు ఆర్థిక వృద్ధికి అడ్డంకులు కావని, దేశాభివృద్ధిని వేగవంతం చేసే చోదకశక్తులని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో గురువారం నిర్వహించిన భారత్ పునరుత్పాదక ఇంధన సదస్సు--ఎక్స్‌పో 2026 ముగింపు సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఆర్థిక ప్రగతిని కొనసాగిస్తూనే శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చని భారత్ తన విజయాలతో నిరూపించిందని పేర్కొన్నారు.



దేశంలో శిలాజేతర ఇంధన వనరుల ఆధారిత స్థాపిత విద్యుత్ సామర్థ్యం 300 గిగావాట్లు దాటిందని ఉపరాష్ట్రపతి తెలిపారు. మొత్తం స్థాపిత విద్యుత్ సామర్థ్యంలో శిలాజేతర వనరుల వాటాను 50 శాతానికి చేర్చే లక్ష్యాన్ని నిర్దేశిత గడువుకు ఐదేళ్ల ముందుగానే 2025లో సాధించామన్నారు. దశాబ్ద కాలంలో సౌర విద్యుత్ సామర్థ్యం మూడు గిగావాట్లలోపు నుంచి 170 గిగావాట్లకు పైగా పెరిగిందని వివరించారు.

ఒకప్పుడు బొగ్గు ఆధారిత విద్యుత్ కంటే ఎంతో ఖరీదైన సౌర విద్యుత్, ప్రస్తుతం దేశంలో అత్యంత చౌకైన విద్యుత్ వనరుల్లో ఒకటిగా మారిందన్నారు. సమర్థ విధానాలు, ప్రైవేటు రంగ చొరవ, రాష్ట్రాలు, ప్రజల సమష్టి కృషి ఈ పరివర్తనకు కారణమని చెప్పారు. హైడ్రోజన్ ఇంధన రంగంలోనూ ప్రోత్సాహకర పురోగతి కనిపిస్తోందని, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో భవిష్యత్తులో ఇది మరింత అందుబాటు ధరలకు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత పునరుత్పాదక ఇంధన ప్రగతి అభివృద్ధి చెందుతున్న దేశాలకు స్ఫూర్తిదాయక నమూనాగా నిలుస్తోందన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతతో చేపట్టిన చర్యలు విద్యుత్ అందుబాటును పెంచడంతోపాటు పరిశ్రమల వ్యయాన్ని, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తూ ఉపాధి అవకాశాలను విస్తరిస్తున్నాయని పేర్కొన్నారు. పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య సహకారం పెరగాలని సూచించారు. నేటి ప్రయోగశాలలు, అంకుర సంస్థల నుంచే 2040 నాటి సాంకేతికతలు ఆవిర్భవిస్తాయని వ్యాఖ్యానించారు.

పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన కింద 65 లక్షలకు పైగా కుటుంబాలు సౌర ఉద్యమంలో భాగస్వాములయ్యాయని తెలిపారు. పీఎం--కుసుమ్ ద్వారా దాదాపు 30 లక్షల మంది రైతులు లబ్ధి పొందారని చెప్పారు. సౌర పంపులతో డీజిల్ ఖర్చు తగ్గడంతోపాటు అదనపు ఆదాయం లభిస్తోందని, రైతులు అన్నదాతలుగానే కాకుండా ఇంధనదాతలుగానూ మారుతున్నారని అన్నారు.

పీఎం--జన్‌మన్, ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమాల ద్వారా మారుమూల గిరిజన ప్రాంతాలకు విద్యుత్ సదుపాయం విస్తరిస్తోందన్నారు. విద్యుత్ అందుబాటుతో విద్య, వైద్యం, సమాచార వ్యవస్థలు, జీవనోపాధి రంగాల్లో అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.

స్వచ్ఛ ఇంధన పరివర్తన ప్రజా ఉద్యమంగా మారాలని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, పౌరులు చురుగ్గా భాగస్వాములు కావాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో కొత్త ఆర్థిక అవకాశాలు, ఉపాధి, కుటుంబాల ఆర్థిక సౌభాగ్యం పెరుగుతాయని చెప్పారు. మిషన్ లైఫ్ స్ఫూర్తితో విద్యుత్ పొదుపు, బాధ్యతాయుత వినియోగం, వ్యర్థాల సరైన నిర్వహణను దైనందిన జీవితంలో పాటించాలని సూచించారు.

2047 నాటికి వికసిత్ భారత్, 2070 నాటికి నికర శూన్య ఉద్గారాల లక్ష్యాలను సాధించాలన్న సంకల్పాన్ని పునరుద్ఘాటించారు. 2070 నాటికి దేశ విద్యుత్ డిమాండ్ దాదాపు ఏడురెట్లు పెరిగే అవకాశం ఉన్నందున స్వచ్ఛమైన, విశ్వసనీయమైన, అందుబాటు ధరల విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి పెట్టాలన్నారు. సదస్సులోని చర్చలను ప్రాజెక్టులుగా, ప్రాజెక్టులను విద్యుదుత్పత్తిగా మార్చాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన రాష్ట్రాలు, ప్రభుత్వ విభాగాలు, విక్రేతలు, బ్రాండ్ యజమానులు, ప్రభుత్వ రంగ బ్యాంకులకు పునరుత్పాదక ఇంధన ప్రతిభా పురస్కారాలు, పీఎం సూర్యఘర్ అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, సహాయ మంత్రి శ్రీపాద్ యెస్సో నాయక్, కేంద్ర ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు డాక్టర్ అజయ్ కుమార్ సూద్, పునరుత్పాదక ఇంధన శాఖ కార్యదర్శి సంతోష్ కుమార్ సారంగి తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాలతోనే పర్యావరణ పరిరక్షణ

ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి

తిమ్మాపూర్ చౌరస్తాలో వైభవంగా 'ఈడెన్ ఁ శుభమ్ ఈవీ' షోరూం ప్రారంభం

ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి





పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగమే శరణ్యమని, రాబోయే భవిష్యత్తు అంతా ఈవీలదేనని ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం తిమ్మాపూర్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన అధునాతన "ఈడెన్ ఁ శుభమ్ ఈవీ" ఎలక్ట్రిక్ వాహనాల షోరూంను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. రోజురోజుకూ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ఇంధన ధరల భారం నుంచి సామాన్య ప్రజలకు ఉపశమనం కలిగించడంతో పాటు, కాలుష్య నియంత్రణ సమాజ స్థాపనకు ఎలక్ట్రిక్ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో, తక్కువ ఖర్చుతో ఎక్కువ మైలేజ్ ఇచ్చే ఆకర్షణీయ మోడళ్లను స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. ఈ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నూతనంగా షోరూం ఏర్పాటు చేసిన నిర్వాహకులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షోరూం యాజమాన్య ప్రతినిధులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజలు తదితరు పాల్గొన్నారు.

ఎండిన పంటలు.. గుండెకోత: కరువులోనూ కనికరించని సర్కారు -- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆగ్రహం





పల్లెల్లో కరువు తాండవిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నుంచి కనీస స్పందన కరువైందని, ఎండిపోయిన చేలను చూసి రైతన్నలు కన్నీరుమున్నీరవుతున్నారని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఫరూఖ్ నగర్ మండలం కడియాల కుంట తండాతో పాటు పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన ఎండిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లోనే పంటలు ఎండిపోవడం బాధాకరమన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గవచ్చని వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలో సంపూర్ణంగా విఫలమైందన్నారు. వర్షాకాలం ప్రారంభంలో గోదావరి, కృష్ణా నదుల్లో వరద నీరు వచ్చినా నీటిని ఎత్తిపోసుకోవడంపై దృష్టి పెట్టకుండా, కేవలం రాజకీయాలకే ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు. సరిపడా విద్యుత్ ఇస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్న ప్రభుత్వం.. ఎండిపోతున్న పంటలకు ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు.

అంజయ్య యాదవ్ ప్రధాన డిమాండ్లు:

ఎండిన పంటలకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలి.

వచ్చే యాసంగి పంటలకు 100% రాయితీతో విత్తనాలు, 50% రాయితీతో ఎరువులు పంపిణీ చేయాలి.

ఉన్న నీటితోనే సాగు చేసుకునేలా బిందు సేద్యాన్ని (డ్రిప్) విస్తృతంగా ప్రోత్సహించాలి. వానాకాలం పంటలకు ఎలాంటి షరతులు లేకుండా మద్దతు ధర చెల్లించాలి. యాసంగి మొదలవుతున్నా నేటికీ రైతు భరోసాపై ప్రభుత్వానికి స్పష్టత లేకపోవడం దారుణమన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బక్కన్న యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ మౌనిక హరి, పలువురు సర్పంచులు, పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి భవన నిర్మాణానికి భూమి, రూ.5 కోట్ల నిధులు విడుదల

పద్మశాలి సంఘాల నేతల హర్షం.. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు



సికింద్రాబాద్: పద్మశాలి కులస్తుల చిరకాల స్వప్నమైన పద్మశాలి భవన నిర్మాణానికి కోకాపేటలో 2.5 ఎకరాల భూమితో పాటు భవన నిర్మాణం కోసం రూ.5 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.

ఈ సందర్భంగా గురువారం ఉదయం 11 గంటలకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసం వద్ద పద్మశాలి సంఘాల ప్రతినిధులు, పెద్దలు సమావేశమై రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పద్మశాలి సామాజిక వర్గ అభ్యున్నతికి సహకరించి, భవన నిర్మాణానికి భూమి, నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావులకు పద్మశాలి పెద్దలు, బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపకులు దాసు సురేష్, సీఈఓ దంత ఆనంద్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో చేనేత వస్త్ర వ్యాపార పనివారల సంక్షేమ సంఘం అధ్యక్షులు మంద వెంకటస్వామి, వస్త్ర వ్యాపార సంక్షేమ సంఘం అధ్యక్షులు మంద ఈశ్వర్, సికింద్రాబాద్ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు మంద మురళి, ప్రధాన కార్యదర్శి చింతకింది మల్లేష్, కోశాధికారి బొగ్గు శ్రీధర్, గంపేట రాజు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సమాజానికి ప్రత్యేక భవనం నిర్మాణం కోసం భూమి, నిధులు కేటాయించడం పట్ల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

శుద్ధి చేసిన నీటి నాణ్యతపై రాజీ పడొద్దు: జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

నానక్‌రామ్‌గూడ, ఖాజాగూడ ఎస్టీపీలను సందర్శించిన ఎండీ

బౌల్డర్ హిల్స్‌కు శుద్ధి చేసిన నీటి సరఫరా పైప్‌లైన్ పనులను వేగవంతం చేయాలి

ఎస్టీపీల వద్ద నీటి నాణ్యత వివరాలు కనిపించేలా ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలి



హైదరాబాద్ నవంబర్ 5

మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీలు) నుంచి సరఫరా చేసే శుద్ధి చేసిన నీటి నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుద్ధి చేసిన నీటిని నిర్మాణ రంగం, గార్డెనింగ్, ల్యాండ్‌స్కేపింగ్ తదితర తాగేతర అవసరాలకు విస్తృతంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గురువారం నానక్‌రామ్‌గూడ, ఖాజాగూడ ఎస్టీపీలను సందర్శించిన ఆయన.. శుద్ధి చేసిన నీటి నాణ్యత, గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ఫిల్లింగ్ స్టేషన్లు, సరఫరా ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలి..

అనంతరం ఖాజాగూడ ఎస్టీపీని సందర్శించిన ఎండీ.. శుద్ధి చేసిన నీరు బయటకు విడుదలయ్యే అవుట్‌లెట్‌ను పరిశీలించారు. నీటి శుద్ధి ప్రక్రియ, నాణ్యత ప్రమాణాలు, పునర్వినియోగానికి అనుకూలతపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

శుద్ధి చేసిన నీరు పునర్వినియోగానికి నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉందో లేదో నిరంతరం పరీక్షించాలని ఆదేశించారు. బీవోడీ (దీూణ), సీవోడీ (జూణ), టీఎస్ఎస్ (ూూ), పీహెచ్ (జూఽ) తదితర నాణ్యత పారామీటర్లను క్రమం తప్పకుండా పరిశీలించి, ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. నీటి శుద్ధి ప్రక్రియలో ప్రతి దశలోనూ ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని, నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు.

ట్యాంకర్ల రాకపోకలకు అనువుగా ఫిల్లింగ్ స్టేషన్లను అభివృద్ధి చేయాలి..

ఎస్టీపీల వద్ద గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ఫిల్లింగ్ స్టేషన్లను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ట్యాంకర్లు లోపలికి ప్రవేశించడం, నీటిని నింపుకోవడం, తిరిగి బయటకు వెళ్లడం వంటి ప్రక్రియల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇందుకోసం ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద అంతర్గత రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు, ట్యాంకర్లు సులభంగా రాకపోకలు సాగించేందుకు తగిన స్థలం, మలుపులు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఏర్పాటు చేయాలన్నారు. ఒకేసారి ఎక్కువ ట్యాంకర్లు వచ్చినా ట్రాఫిక్ అంతరాయం లేకుండా, నీటి నింపే ప్రక్రియ వేగంగా పూర్తయ్యేలా మౌలిక సదుపాయాలను కల్పించాలని స్పష్టం చేశారు. ఇతర ఎస్టీపీలకు ఆదర్శంగా నిలిచేలా ఫిల్లింగ్ స్టేషన్లను మోడల్ కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఎస్టీపీల వద్ద ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డులు..

ప్రతి ఎస్టీపీ వద్ద శుద్ధి చేసిన నీటి నాణ్యత వివరాలు అందరికీ స్పష్టంగా కనిపించేలా ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని ఎండీ అధికారులను ఆదేశించారు. నీటి నాణ్యతకు సంబంధించిన బీవోడీ, సీవోడీ, టీఎస్ఎస్, పీహెచ్ తదితర పారామీటర్లు డిజిటల్ స్క్రీన్లపై ప్రదర్శించాలని సూచించారు. నీటి నాణ్యతపై పారదర్శకత పెంచడంతో పాటు, వినియోగదారులకు నమ్మకం కలిగించేలా ఈ ఏర్పాట్లు ఉండాలన్నారు.

శుద్ధి చేసిన నీటి పునర్వినియోగాన్ని పెంచడం ద్వారా విలువైన తాగునీటిని ఆదా చేయవచ్చని ఎండీ పేర్కొన్నారు. ముఖ్యంగా నిర్మాణ రంగం, వాణిజ్య సంస్థలు, భారీ వినియోగదారులు తాగేతర అవసరాలకు శుద్ధి చేసిన నీటినే వినియోగించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గ్రీన్ వాటర్ ట్యాంకర్ల వినియోగాన్ని విస్తరించడంతో పాటు, ఎస్టీపీల నిర్వహణలో నాణ్యత, పారదర్శకత, నిరంతర పర్యవేక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జలమండలి ఎస్టీపీ సీజియం పద్మజ, జిఎమ్ సుబ్బారాయుడుతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సులో భాగంగా బియ్యం ధరల నియంత్రణ,

●జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,



ప్రజా శ్రేయస్సులో భాగంగా ప్రభుత్వం బియ్యం ధరల నియంత్రణ చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో సమత రైస్ డిపో వారు ఏర్పాటు చేసిన బియ్యం అమ్మకాల అవుట్ లెట్ ను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్, జిల్లా మేనేజర్ శ్రీకళ, మండల తహసిల్దార్ వనజ రెడ్డి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట ధరలకు మించి అమ్మకాలు జరుపకూడదని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎల్ నినో ప్రభావం వల్ల ప్రస్తుతం మార్కెట్ లో నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు అందరూ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ ప్రజలకు బియ్యం ధరలను అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ నిర్ణీత ధరకే విక్రయాలు జరిగేలా రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులతో ఆకస్మిక తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, తనిఖీల కోసం వచ్చే బృందాలకు వ్యాపారులు, ట్రేడర్లు సహకరించాలని తెలిపారు. 26 కిలోల బరువుతో కూడిన ప్రీమియం క్వాలిటీ బి.పి.టి. న్యూ రైస్ బ్యాగ్ ను 1 వేయి 352 రూపాయలు, స్టీమ్ రైస్ ను 1 వేయి 482 రూపాయలు, పాత బియ్యం 1 వేయి 638, హెచ్.ఎం.టి. పాత రకం బియ్యం బస్తా 1 వేయి 950 రూపాయలు, జై శ్రీరామ్ పాత బియ్యం 1 వేయి 976 రూపాయల చొప్పున అవుట్ లెట్ ద్వారా నిబంధనల ప్రకారం విక్రయాలు జరుపుతామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహాకవి దాశరథి కృష్ణమాచార్యుల వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



మహాకవి దాశరథి కృష్ణమాచార్యుల వర్ధంతి సందర్భంగా నాంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కత్తి రవీందర్ రెడ్డి ఘన నివాళులు అర్పించారు.తెలంగాణ ప్రజల హక్కుల కోసం తన కలం ద్వారా నిరంతరం పోరాడిన మహాకవి దాశరథి కృష్ణమాచార్యుల సేవలు చిరస్మరణీయమని కత్తి రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ గర్వించే గొప్ప కవిగా దాశరథి తన రచనలతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని అన్నారు.
తెలంగాణ గౌరవాన్ని ప్రజల ఆకాంక్షలను తన సాహిత్యం ద్వారా ప్రపంచానికి చాటిచెప్పిన దాశరథి ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.ఆయన వర్ధంతి సందర్భంగా మహాకవి దాశరథికృష్ణమాచార్యులకు ఘన నివాళులు అర్పిస్తున్నట్లు కత్తి రవీందర్ రెడ్డి పేర్కొన్నారు

తబలా వాయిద్యంలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

●కంద రాఘవేందర్‌కు ఘన సన్మానం.. విద్యార్థి ప్రతిభను అభినందించిన టీ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కంద పెద్ద నరసింహ





తబలా వాయిద్యంలో తన అద్భుత ప్రతిభను చాటుతూ జిల్లా స్థాయి సంగీత పోటీల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సాయిరెడ్డిగూడ గ్రామానికి చెందిన విద్యార్థి కంద రాఘవేందర్‌కు కడ్తాల్‌లో ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ నెల 2వ తేదీన రాగన్నగూడలోని వశిష్ట హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సంగీత పోటీల్లో కడ్తాల్ జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న కంద రాఘవేందర్ తబలా వాయిద్యంలో అద్భుత ప్రదర్శన కనబరిచి న్యాయనిర్ణేతల ప్రశంసలు అందుకున్నాడు. ఈ ప్రదర్శనతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.ఈ సందర్భంగా కడ్తాల్ జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థి రాఘవేందర్‌ను టీ ఏమర్పీఎస్ జిల్లా నాయకులు కంద పెద్ద నరసింహ ప్రత్యేకంగా అభినందించి ఘనంగా సన్మానించారు. చిన్న వయసులోనే సంగీత రంగంపై ఆసక్తి పెంచుకుని, తబలా వాయిద్యంలో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు.చదువుతో పాటు క్రీడలు, కళలు, సంగీత రంగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను వెలికితీసుకోవాలని, వారిలోని నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా నాయకులు అభిప్రాయపడ్డారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాఘవేందర్ విజయం సాధించి తన గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెవిటి జంగయ్య, ఉపాధ్యాయులు, టీ ఏమార్పీఎస్ జిల్లా నాయకులు కంద పెద్ద నరసింహ, బి ఆర్ ఎస్ యూత్ అధ్యక్షులు కంబాలపల్లి అంజి, సిద్ధిగారి మణికంఠ తదితర నాయకులు పాల్గొన్నారు.

శ్రీ కోట హర్షిత్ సాయి 17వ వర్ధంతి సందర్భంగా మదర్ థెరిస్సా సేవాసదనంలో అన్న వితరణ చేసిన దెందుకూరు సొసైటీ చైర్మన్ కోట వెంకట కృష్ణ, మాజీ సర్పంచ్ విజయశాంతి దంపతులు.

●కన్నకొడుకు జ్ఞాపకార్థం.. దివ్యాంగ పిల్లల ఆకలి తీర్చిన కోట దంపతుల ఉదారత



దెందుకూరు వాస్తవ్యులు, దెందుకూరు సొసైటీ చైర్మన్ శ్రీ కోట వెంకట కృష్ణ మరియు దెందుకూరు మాజీ సర్పంచ్ శ్రీమతి విజయశాంతి దంపతుల కుమారుడు కోట హర్షిత్ సాయి 17వ వర్ధంతి వేడుకలను అత్యంత మానవత్వంతో నిర్వహించారు. తమ కుమారుడి జ్ఞాపకార్థం మదర్ థెరిస్సా సేవాసదనము మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రము నందు ఆశ్రమ పిల్లలకు అన్న వితరణ (అన్నదానం) చేశారు.
ఈ సందర్భంగా కోట హర్షిత్ సాయి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని, వారి తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు ఆ దేవుడు ఎల్లప్పుడూ కొండంత ఆదరణ, ఓదార్పునివ్వాలని ఆశ్రమంలోని మానసిక దివ్యాంగ పిల్లల తరపున భగవంతుడిని ప్రార్థించారు.
కన్నప్రేమను సమాజ సేవలో చూపిస్తూ, వర్ధంతి వేళ దివ్యాంగ పిల్లలను ఆదరించి అన్నదానం చేసిన కోట వెంకటకృష్ణ, విజయశాంతి దంపతులకు మదర్ థెరిస్సా సేవా సదనము నిర్వాహకులు మరియు పిల్లల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు.

చంద్రపురి డివిజన్ అభివృద్ధికి పెద్దపీట

●రూ.14 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



చంద్రపురి కాలనీ డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. చంద్రపురి కాలనీ పరిధిలోని మోహన్ రావు నగర్‌లో రూ.14 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు స్థానిక కార్పొరేటర్ బింగి లావణ్య సతీష్ గౌడ్‌తో కలిసి మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ చంద్రపురి కాలనీ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కారింగుల రాజు గౌడ్, పసుపులేటి భాస్కర్ రావు, ఉపాధ్యక్షులు గోనె చిట్టి బాబు, ప్రధాన కార్యదర్శి మాధవ రెడ్డి, అధికార ప్రతినిధి మొగిలిపాక పరశురామ్, కోశాధికారి అశోక్ గుప్తా, సాయి కృష్ణ (మిట్టు), కాలనీ అధ్యక్షులు సార్ల రమేష్, ఉపాధ్యక్షులు స్వామి గౌడ్, నాయకులు సత్యనారాయణ చారి, సత్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

హైదర్ నగర్‌లో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

●ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చొరవతో పనులు పూర్తి



మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని హైదర్ నగర్ కాలనీలో రూ.5 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన ఈ పనులను మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ పర్యవేక్షించారు.గత నెలలో కాలనీలో పర్యటించిన సమయంలో దర్గా సమీపంలోని వీధిలో సీసీ రోడ్డు నిర్మించాలని స్థానికులు జగదీష్ గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంటనే స్పందించి ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో రూ.5 లక్షల నిధులు మంజూరై నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.కాలనీ సమస్యపై స్పందించి రోడ్డు నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు అలందర్, మౌళి సాబ్, సాజిద్, చైతన్య, గఫూర్, మహమూద్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నీలం సతీష్, శ్రీనివాస్ గౌడ్, ఇస్మాయిల్, కొప్పెర శ్రీకాంత్, సల్ల శ్రీకాంత్, శశి తదితరులు పాల్గొన్నారు.

ఐ.ఎఫ్.ఎం.ఐ.ఎస్. పోర్టల్, డిజిటల్ గవర్నెన్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలి,

●జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు





ఐ.ఎఫ్.ఎం.ఐ.ఎస్. పోర్టల్, డిజిటల్ గవర్నెన్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో హెచ్ ఓ ఓ లు, డి డి ఓ లు, మండల స్థాయి అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్‌పాండే తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యతనిస్తూ ఐ.ఎఫ్.ఎం.ఐ.ఎస్. విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తుందని తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నుంచి ఐ.ఎఫ్.ఎం.ఐ.ఎస్. పోర్టల్ ద్వారా అన్ని బిల్లుల సమర్పణ డిజిటల్ విధానంలో కొనసాగుతుందని, 2027 జనవరి 1వ తేదీ నుంచి మాన్యువల్ విధానానికి పూర్తిగా స్వస్తి పలికి, ప్రభుత్వ కార్యకలాపాలను డిజిటల్ విధానంలోనే నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు. డిసెంబర్ 31వ తేదీలోగా ఉద్యోగుల సర్వీస్ రిజిస్టర్లలో చేయవలసిన అన్ని వివరాల నమోదు, అప్‌డేషన్లను పూర్తి చేయాలని సూచించారు. జనవరి 1వ తేదీ నుంచి ఎంప్లాయీ సర్వీస్ రిజిస్టర్ పూర్తిస్థాయిలో అమలులోకి వస్తుందని తెలిపారు. నూతన డిజిటల్ విధానాలపై ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పూర్తి అవగాహన కలిగి ఉండాలని, శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. శిక్షణలో భాగంగా ఈ.ఎస్.ఆర్. లో ఉద్యోగుల వివరాల నమోదు, నియామకాలు, పోస్టింగులు, సెలవుల దరఖాస్తు, సెలవుల రద్దు తదితర అంశాలను ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ ఆర్ ఎస్ లో ఒకసారి నమోదు చేసిన వివరాలను తిరిగి ఎడిట్ / డిలీట్ చేసే అవకాశం లేనందున, వివరాల నమోదు, ఆమోదం సమయంలో అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సందేహాలను శిక్షణలోనే నివృత్తి చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే ను పకడ్బందీగా నిర్వహించాలి,

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. శ్రీనివాస్ లతో కలిసి సర్వేయర్లకు జి.ఎన్.ఎస్.ఎస్. రోవర్లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, సంబంధిత రైతులకు ముందుగా సమాచారం అందించి, ప్రతి రైతు రీ సర్వేలో హాజరయ్యే విధంగా టామ్ టామ్ ద్వారా తెలియజేయాలని తెలిపారు. రీ సర్వే ద్వారా భవిష్యత్తులో భూ సమస్యలు ఉండవని తెలిపారు. ప్రక్రియ నిర్వహణ కొరకు సర్వేలో వినియోగించే 12 రోవర్లను అందించడం జరిగిందని, వీటి ద్వారా ఖచ్చితమైన సర్వేను చేపట్టడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ సర్వే దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి,

●జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు,



పెండింగ్ సర్వే దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్ పాండే, సబ్ కలెక్టర్ కార్యాలయం ఎ.ఓ., అన్ని మండలాల తహసిల్దార్లు, అధికారులు, సంబంధిత సెక్షన్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సర్వే దరఖాస్తులు, సర్వే పనుల పురోగతి, జి.ఓ. నం. 76, 59 అమలు తీరు, ఎస్ఐఆర్ ప్రక్రియ, భూ భారతి, భూదాన్ భూములకు సంబంధించిన ఫైళ్లు, కోర్టు కేసులపై సమీక్షించారు. ఆయా అంశాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా ప్రతి పనిని పూర్తి చేయాలని, ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశించిన సమయంలోగా అన్ని పనులు పూర్తి చేయాలని తెలిపారు.
ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి,



భీమారం గ్రామానికి చెందిన మంచాల మల్లేష్, వయస్సు (45) సంవత్సరాలు అనే వ్యక్తి విద్యుత్ షాక్ తో మృతి చెందినట్టు భీమారం ఎస్సై ఏ. రాజేందర్ తెలిపారు. భీమారం ఎస్సై ఏ. రాజేందర్, మాట్లాడుతూ భీమారం గ్రామానికి చెందిన మంచాల మల్లేష్ అనే వ్యక్తి తాను పనిచేస్తున్న పత్తి చేనుకు రాత్రి సమయంలో కాపలాగా వెళ్ళగా అక్కడ ఉన్న విద్యుత్ తీగ ప్రమాదవశాత్తు తగలడంతో తీవ్ర విద్యుత్ షాక్ కు గురై నవంబర్ 5వ తేదీన అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో మృతి చెందినట్లు, జరిగిన సంఘటనపై మృతుని భార్య మంచాల భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు

రామాయణ.. ప్రతి సీనూ

ఆస్వాదించా: రాజమౌళి ప్రశంసలు





అత్యధిక బడ్జెట్‌తో తెరకెక్కిన 'రామాయణ: పార్ట్ 1' (భారీ అంచనాల మధ్య నేడు (నవంబరు 5) విడుదలైంది. రణ్‌బీర్ కపూర్ , యశ్ సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రంపై ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ సినిమాను ఆవిష్కరించిన తీరును కొనియాడుతూ దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ పెట్టారు.

"రామాయణ' చిత్రంలోని అత్యున్నత హంగులు, వెండితెరపై ఆవిష్కరించిన అద్భుతమైన విజువల్స్ కనువిందు చేస్తున్నాయి. రాముడిగా రణ్‌బీర్ కపూర్ నటన ఆకట్టుకుంది. ముఖ్యంగా వనవాస ఘట్టం నుంచి అతడి అభినయం ఎంతో ప్రశాంతంగా కనిపిస్తూనే, ప్రతి ఒక్కరినీ కట్టిపడేసింది. రావణుడిగా యశ్ ఆద్యంతం భయపెట్టారు. సీతగా సాయిపల్లవి హుందాగా కనిపించారు. పతాక సన్నివేశాలతో పాటు అంతకు ముందు వచ్చే ఘట్టాలైతే అత్యద్భుతం. ప్రతి సన్నివేశాన్ని ఎంతో ఆస్వాదించాను. ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన, భారీ విజన్‌ను తెరపై ఇంత అందంగా ఆవిష్కరించినందుకు నిర్మాత నమిత్ మల్హోత్ర, దర్శకుడు నితేశ్ తివారీతో పాటు చిత్రబృందం మొత్తానికి హృదయపూర్వక అభినందనలు" అని రాజమౌళి ప్రశంసించారు.

మాటలు రావుగానీ.... చెప్పలేనంత ప్రేమ



"ఒక్క మాట కూడా మాట్లాడకుండా తొలి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించనున్న అనీష్‌కి.. అద్భుతమైన ఆరంభం లభించాలని కోరుకుంటున్నాన"ని అన్నారు కథానాయకుడు ఎన్టీఆర్. తాజాగా ఆయన అనీష్, అనస్వర రాజన్ నాయకానాయికలుగా తెరకెక్కిన 'ఇట్లు అర్జున' సినిమా ట్రైలర్‌ని విడుదల చేశారు. "మొదటి చిత్రానికే ఇలాంటి పాత్రను ఎంచుకోవడం అనీష్ ధైర్యానికి నిదర్శనం. దీంతో కథపై తనకి ఎంత నమ్మకం ఉందో అర్థమవుతోంద"ని అంటూ ఎక్స్ వేదికగా చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు ఎన్టీఆర్.

అక్కినేని నాగార్జున సమర్పణలో మహేశ్ ఉప్పల తెరకెక్కించిన ఈ చిత్రాన్ని వెంకీ కుడుముల నిర్మించారు. ఓ దొంగని పట్టుకునేందుకు రంగంలోకి దిగిన పోలీసులు.. మాటలురాని అసాధారణమైన వ్యక్తి అర్జున్ వెంట పడతారు. ఒక మిస్టీరియస్ పెన్‌డ్రైవ్, రూ.వెయ్యికోట్ల డీల్ గురించి గాలిస్తున్న రౌడీలు, పోలీసుల వేటలో అతడు ఎలా చిక్కుకున్నాడు? అర్జున్ దొంగా లేకా అమాయకుడా? ఆ పెన్‌డ్రైవ్‌లో ఉన్న రహస్యాలేంటి అనే ప్రశ్నలు రేకెత్తించేలా ఉత్కంఠగా సాగిందీ ట్రైలర్. చివరిగా 'వీడికి మాటలు రావుగానీ.. మాటల్లో చెప్పలేనంత ప్రేమా.. లవ్వూ' అనే డైలాగు ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమా ఈ నెల 13న థియేటర్లలోకి రానుంది.

అప్పుడు పండు... ఇకపై మహంతి ఝాన్సీరాణి!



నాగార్జున - టబు కలయిక అనగానే 'నిన్నే పెళ్లాడతా' సినిమానే గుర్తొస్తుంది. అందులో పండు పాత్రలో టబు... ఆ పేరుతో పిలుస్తూ ఆట పట్టించే నాగార్జున... ఆ ఇద్దరి మధ్య కెమిస్ట్రీని ప్రేక్షకులు ఎప్పటికీ మరిచిపోలేరు. ఆ తర్వాత ఈ ఇద్దరూ 'అవిడా మా అవిడే' సినిమాలో కలిసి నటించారు. 28 ఏళ్ల తర్వాత మళ్లీ ఆ జంట కలిసి నటిస్తున్న సినిమా... 'కింగ్ 100'. ఇది నాగార్జునకు వందో చిత్రం కావడం విశేషం. రా.కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తోంది. టబు పుట్టినరోజుని పురస్కరించుకుని బుధవారం ప్రచార చిత్రాన్ని విడుదల చేసింది చిత్రబృందం.

'ఈ ప్రపంచంలో రెండు రకాల మనుషులు ఉంటారు. లక్‌ని నమ్మేవాళ్లు ఒకరు, హార్డ్‌వర్క్‌ని నమ్మేవాళ్లు మరొకరు. ఐ హేట్ లక్' అంటూ మహంతి ఝాన్సీరాణి అనే పాత్రలో సందడి చేశారు టబు. "ప్రపంచం 'నిన్నే పెళ్లాడతా' సినిమాలోని పండుని ఎప్పటికీ మరిచిపోదు. ఇక నుంచి మా జ్ఞాపకాల్లో మహంతి ఝాన్సీరాణి పాత్రలో నిలిచిపోతావు" అంటూ ప్రచార చిత్రాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు నాగార్జున. ఈ సినిమా క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు 24న ప్రేక్షకుల ముందుకు రానుంది.

హై వోల్టేజ్ యాక్షన్‌తో 'ఓం'



దర్శకుడిగా, హీరోగా వైవిధ్యమైన కథలతో అలరిస్తోన్న ధనుష్ ప్రధాన పాత్రలో నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'ఓం'. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకుడు. ఈ చిత్రంలో మలయాళ అగ్ర కథానాయకుడు మమ్ముట్టి, సాయిపల్లవి, శ్రీలీల కీలక పాత్రల్లో నటించారు. నవంబరు 20న రానున్న ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ విడుదల చేస్తోంది. ఆసక్తికరమైన కథ, కథనాలు, హైవోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలతో సాగే ఈ చిత్రం అందర్నీ అలరిస్తుందని చిత్రబృందం తెలిపింది. ఈ సినిమాకి సాయి అభ్యంకర్ సంగీతమందించారు.

మనసుల్ని హత్తుకునేలా... 'చబాలు గీత'




"గొప్ప కథలకు వేదికగా మారింది ఈటీవీ విన్. మరోసారి ఓ మంచి కథతో రూపొందిన 'చబాలు గీత' ఆ వేదికపై నుంచి అందరికీ చేరువ కానుంది" అన్నారు సుప్రియ యార్లగడ్డ. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై ఆమె నిర్మించిన చిత్రమే 'బాలు గీత'. సందీప్ సరోజ్, కేయురి జంటగా నటించారు. ప్రతాప్ కొల్లారెడ్డి దర్శకత్వం వహించారు. ఆనంద్ రెడ్డి కర్నాటి, హరీశ్ కోహిర్కర్ సహ నిర్మాతలు. ఈ చిత్రం నేటి నుంచి ప్రముఖ ఓటీటీ వేదిక ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం బుధవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించింది. నటి, నిర్మాత నిహారిక కొణిదెల ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

సుప్రియ యార్లగడ్డ మాట్లాడుతూ "చాలా మంది జీవితాల్లో జరిగిన సంఘటనల్ని ప్రతిబింబించే కథ ఇది. మేం ఈ కథ తీసుకు వెళ్లగానే ఈటీవీ విన్ ఎంతో ప్రోత్సాహం అందించింది. పెద్ద తారలతో సినిమాలు, పెద్ద బడ్జెట్‌తో కూడిన సినిమాలు తీసి విజయాలు సాధించడం వేరు... మనసుకు హత్తుకునే ఇలాంటి కథల్ని నమ్మి, కొత్తతరం ప్రతిభకి పట్టం కడుతూ 'చబాలు గీత' తరహా సినిమాలు తీయడంతో వచ్చే తృప్తి వేరు. ఈ చిత్రం ప్రేక్షకుల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిరుత్సాహపరచదు" అన్నారు. నిహారిక కొణిదెల మాట్లాడుతూ "ప్రేమకథలంటే నాకు చాలా ఇష్టం. ట్రైలర్ చూస్తున్నప్పుడు ఆరంభంలో శేఖర్ కమ్ముల సినిమాలా అనిపించింది. ఇలాంటి మంచి కథలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న సుప్రియ యార్లగడ్డ ఓ నిర్మాతగా నాకు ఎంతో స్ఫూర్తినిస్తుంటారు. ఈ చిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా" అన్నారు.

"పెళ్లి తర్వాత మొదలయ్యే ఓ ప్రేమకథతో ఈ చిత్రం రూపొందింది. చాలా అందంగా ఉంటుంది. ఈ సినిమా చూశాక ఓ తోడు ఉంటే బాగుంటుందనే అనుభూతి ప్రతి ఒక్కరికీ కలుగుతుంది" అన్నారు సందీప్ సరోజ్. దర్శకుడు మాట్లాడుతూ "ప్రేమకథల్లో ఓ కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తుందీ చిత్రం. అందరూ తమని తాము చూసుకునేలా ఈ సినిమా ఉంటుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ భరణ్, సహ నిర్మాత హరీశ్‌తోపాటు చిత్రబృందం పాల్గొంది.

జోడీ కుదిరిందా?

ఈ సంక్రాంతికి 'అనగనగా ఒక రాజు'తో విజయాన్ని అందుకున్నారు నటి మీనాక్షి చౌదరి. ప్రస్తుతం ఆమె చేతిలో రెండు సినిమాలున్నాయి. అందులో నాగచైతన్యతో కలిసి చేసిన 'వృషకర్మ' ఇప్పటికే పూర్తయింది. ఇది ఈ డిసెంబరు 4న తెరపైకి రానుంది. ఇక మరోవైపు కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో కార్తితో కలిసి చేస్తున్న చిత్రం చిత్రీకరణ దశలో ఉంది. అయితే ఇప్పుడు మీనాక్షి తదుపరి చిత్ర విషయమై ఓ ఆసక్తికర చర్చ మొదలైంది. ప్రస్తుతం నితిన్ హీరోగా 'సామజవరగమన' ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వంలో ఓ సినిమా పట్టాలెక్కనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పుడీ ప్రాజెక్ట్ కోసం నాయికగా మీనాక్షి పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.



కొంచెం ప్రేమ కొంచెం డ్రామా



కొంచెం ప్రేమ.. కొంచెం మత్తు.. మరి కొంచెం డ్రామా అంటూ గాయకుడి అవతారమెత్తారు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్. ఆయన.. కథానాయిక చిత్రాంగద సింగ్ జంటగా తెరకెక్కిన సినిమా 'మాతృభూమి'. అపూర్వ లఖియా దర్శకత్వం వహించిన ఈ సినిమాని సల్మాన్ నిర్మించారు. పలు సాంకేతిక సమస్యల కారణంగా ఎప్పుడో ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ చిత్రం వాయిదా పడింది. ఆ తర్వాత విడుదల తేదీపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ నేపథ్యంలో తాజాగా ఈ చిత్రంలో సల్మాన్ పాడిన 'తేరీ బ్యాటీ' పాటను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేశారు. హీరోహీరోయిన్ల ట్టెప్పులతో రొమాంటిక్‌గా సాగుతోందీ గీతం. సాజిద్ ఖాన్ సాహిత్యం అందించారు. సల్మాన్ ఖాన్, ముస్కాన్ కలిసి ఆలపించారు. గతంలోనూ సల్మాన్ పలు చిత్రాల్లో 'హ్యాంగోవర్', 'బేబీ కో బాస్ పసంద్ హై' లాంటి పలు పాటలు పాడారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి,

•జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,





ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో నూతనంగా నిర్మించిన వంటగది, భోజనశాల పరిశీలించి, విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారంతో పాటు నాణ్యమైన విద్యా బోధన అందించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎం.పి.సి. విద్యార్థినులకు గణితంలో అందిస్తున్న బోధన, వారి అభ్యసన స్థాయిని పరిశీలించి పలు సూచనలు చేశారు. బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, అధికారుల తో కలిసి పట్టణంలోని పలు ప్రాంతాలలో ప్రభుత్వ భూముల పరిరక్షణ అంశాలను పరిశీలించారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా నిరంతరం పర్యవేక్షించాలని, ఆక్రమణలు గుర్తించినట్లయితే వెంటనే స్పందించి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలోని కృష్ణా మందిర్ రోడ్డు నం. 2 లో ధనలక్ష్మి ట్రేడర్ వారు ఏర్పాటు చేసిన బియ్యం అమ్మకాల అవుట్ లెట్ ను జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్, మండల తహసిల్దార్ కృష్ణ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల ప్రస్తుతం మార్కెట్ లో నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు అందరూ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ ప్రజలకు బియ్యం ధరలను అందుబాటులో ఉంచాలని, తనిఖీల కోసం వచ్చే బృందాలకు వ్యాపారులు, ట్రేడర్లు సహకరించాలని తెలిపారు. 26 కిలోల బరువుతో కూడిన బి.పి.టి. న్యూ రైస్ బ్యాగ్ ను 1 వేయి 430 రూపాయలు, స్టీమ్ రైస్ ను 1 వేయి 560 రూపాయలు, హెచ్.ఎం.టి. స్టీమ్ రకం బియ్యం బస్తా 1 వేయి 898 రూపాయల చొప్పున అవుట్ లెట్ ద్వారా నిబంధనల ప్రకారం విక్రయించాలని నిర్వాహకులకు సూచించారు. జిల్లాలోని మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి ప్రాంతాలలో ప్రత్యేక విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, భీమారం, శక్తి పేట ప్రాంతాలలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మార్కెట్ ధరలతో పాటు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కటే తక్కువ ధరకు నాణ్యమైన బియ్యాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు విద్యుత్, త్రాగునీరు, సాగునీటి వినియోగంలో పొదుపు పాటించాలని తెలిపారు. రైతులు తక్కువ నీటి అవసరం ఉన్న జొన్న, మొక్కజొన్న, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలలో నీటి వృధాను అరికట్టాలని, విద్యుత్ ను పొదుపుగా వినియోగించాలని, అవసరంలేని సమయంలో ఫ్యాన్లు, లైట్లు ఆపివేయాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 11 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా గుర్తించడం జరిగిందని, నేలను తేమ శాతం, పంటలపై ప్రభావం, లోటు వర్షపాతం అంశాలను ప్రామాణికంగా తీసుకొని శాస్త్రీయంగా అంచనా వేయడం జరిగిందని తెలిపారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.తాండూర్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ తో కలిసి సందర్శించి ప్రభుత్వ భూముల పరిరక్షణపై అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమించినట్లయితే క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆక్రమణదారులకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేయాలని, ప్రభుత్వ భూములను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూభారతి దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. వివిధ ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ నాయబ్ తహసీల్దార్ కల్పన, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డొనూరు సెగ్మెంట్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న వైసీపీ మండల అధ్యక్షుడు



అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం డొనూరు ఎంపీటీసీ సెగ్మెంట్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బిడిజన అప్పారావు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం డొనూరు సెగ్మెంట్ పరిధిలోని పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఆయన ఓటు వేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొని తమకు నచ్చిన అభ్యర్థులను ఎన్నుకునేందుకు ముందుకు రావాలని సూచించారు. ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

చమర్తి సుబ్బరాజు కు నివాళులు అర్పించిన ఒంటిమిట్ట దేశం నేతలు..



రాజంపేట టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు తండ్రి గురువారం అకస్మికంగా గుండె పోటుతో మృతి చెందిన చమర్తి సుబ్బరాజు భౌతికాయానికి రాయచోటి పట్టణంలోని రాజు విద్యాసంస్థల ప్రాంగణంలో ఒంటిమిట్ట మండల టిడిపి సీనియర్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. గతంలో సుబ్బరాజు తో తమకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా జగన్ రాజ్ కుమారుడు లోకేష్ రాజుతో వారు పంచుకోవడం జరిగింది. మృతి చెందిన సుబ్బరాజు పవిత్ర ఆత్మ కు శాంతి చేకూరాలని నాయకు లు తెలిపారు.

సుబ్బరాజు భౌతిక కాయాన్ని సందర్శించిన వారిలో రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఒంటిమిట్ట మండల టిడిపి సీనియర్ నాయకులు కొమరా వెంకట నరసయ్య మామిళ్ళ ఈశ్వరయ్య పామూరు సుబ్రమణ్యం గంగ పేరూరు కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

కొయ్యూరు సెగ్మెంట్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపీటీసీ అభ్యర్థి మీనా



అల్లూరి జిల్లా కొయ్యూరు మండలంలోని కొయ్యూరు ఎంపీటీసీ సెగ్మెంట్‌లో ఎంపీటీసీ అభ్యర్థి మీనా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల సందర్భంగా ఆమె స్థానిక పోలింగ్ కేంద్రానికి చేరుకుని ప్రజాస్వామ్యబద్ధంగా తన ఓటు వేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రం వద్ద ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసిన ఏర్పాట్ల మధ్య ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని అభ్యర్థి మీనా పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొని తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేస్తున్నారు. కొయ్యూరు సెగ్మెంట్‌లో ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగింది.

బి ఆర్ ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపుకై కృషి చేయాలి : మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు.

- ఈనెల 19వ తేదీ నుంచి గ్రామ గ్రామాన ప్రజా సమస్యలపై పాదయాత్ర.



బి ఆర్ ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని పినపాక నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు అన్నారు. బయ్యారం క్రాస్ రోడ్ నందు గల బి.ఆర్.ఎస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రేగా కాంతారావు హాజరైన పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటర్ల నమోదులో అలసత్వం వహించద్దని, మండల వ్యాప్తంగా పట్టభద్రుల ఓటు నమోదులో 70% లక్ష్యాన్ని సాధించడం హర్షించదగ్గ విషయమని కార్యకర్తల కృషిని ప్రశంసించారు.కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై అన్ని వర్గాల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, ఏజెన్సీ ప్రాంత నిధులను దారి మళ్లించి సంక్షేమ పథకాల అమలులో విఫలమయ్యారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. నిరుద్యోగులు, విద్యార్థులు, పట్టభద్రులు ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని, మళ్లీ కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఈనెల 19వ తేదీ నుంచి ప్రజా సమస్యలపై గ్రామ గ్రామాన యాత్ర ను కార్యకర్తల ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా చేపట్టనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ గుమ్మడి గాంధీ, పిఏసిఎస్ చైర్మన్ డాక్టర్ రవిశేఖర్ వర్మ,కొండేరు రాము, దాట్ల వాసు బాబు, పొలిశెట్టి సత్తిబాబు, బత్తుల వెంకటేశ్వర్లు,మాజీ మైనారిటీ కో ఆప్షన్ నెంబర్ ఎస్.కె జహంగీర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దాంపూర్ లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ,





భీమారం మండలంలోని దాంపూర్ గ్రామంలో గురువారం రోజున స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు, ఈ సందర్భంగా దాంపూర్ సర్పంచ్ చేగొండ కుమార్, మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ దాంపూర్ గ్రామంలో చేపట్టినట్టు, రాష్ట్ర ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని అన్నారు, దాంపూర్ గ్రామపంచాయతీలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల జిల్లా పౌర సంబంధాల అధికారి మాదంశెట్టి కృష్ణమూర్తి, ఆదేశాల మేరకు తెలంగాణ సాంస్కృతిక, సారధి కళాకారుల బృంద చేత వాతావరణ పరిస్థితుల రీత్య ఏర్పడిన ఎల్ నినో,(కరువు) ప్రభావం గురించి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై, ఆరోగ్యంపై, మూఢనమ్మకాలపై, గంజాయి, రోడ్డు భద్రత, నీటి పొదుపు, విద్యుత్ పొదుపు, ఆరుతడి పంటలు, ఇంకుడు గుంతలు, ఎండ తీవ్రత తగ్గాలంటే ప్రజలు చెట్లను పెంచాలని అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమంలో కళాకారులు ముల్కల మురళి, మామిళ్ల లచ్చన్న, ఎల్. రమేష్, కోదరి సోమశేఖర్, సల్లూరి సత్యం, నిరోషా, సంధ్య, తస్లీమా, గుడిసె రేలా కృష్ణ, పాల్గొన్నారు

మానవ హక్కుల జిల్లా ప్రధాన కార్యదర్శిగా బోడిగే రాజేష్ ముదిరాజ్ ఎన్నిక

రాజేష్‌కు నియామక పత్రం, ఐడీ కార్డు అందజేత



మానవ హక్కులు, సామాజిక న్యాయ సంస్థ మేధ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా మల్కాజిగిరి గౌతమ్ నగర్ డివిజన్‌కు చెందిన బోడిగే రాజేష్ ముదిరాజ్ ఎన్నికయ్యారు.సంస్థ జాతీయ చైర్మన్ వరుణ్ తేజ ముదిరాజ్, మేధ్చల్--మల్కాజిగిరి జిల్లా చైర్మన్ ఈటల లక్ష్మీనారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో రాజేష్‌కు నియామక పత్రంతో పాటు గుర్తింపు కార్డును అందజేశారు.ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ, తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ మానవ హక్కుల పరిరక్షణకు, సామాజిక న్యాయం కోసం కృషి చేస్తానని తెలిపారు.

వైభవంగా ముగిసిన శ్రీమత్ భాగవత సప్తాహం






భక్తికి ముక్తికి మార్గదర్శకమైన భాగవత సప్తాహం మానవ జీవితాన్ని తరింప చేస్తుందని ప్రవచకులు బ్రహ్మశ్రీ పారువెల్ల ఫణీశర్మ అన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రముఖ క్షేత్రమైన అయోధ్యలో గత నెల 28 నుండి ఈనెల మూడవ తేదీ వరకు శ్రీ భాగవత సప్తాహం కొనసాగింది. కరీంనగర్ పట్టణానికి చెందిన వొల్లాల హరిశంకర్, మంథని పట్టణానికి చెందిన గట్టు గీతా ఆధ్వర్యంలో తెలంగాణలోని హైదరాబాద్ , మంథని, కరీంనగర్, జగిత్యాల, తదితర పట్టణాల నుండి సుమారు 100 మంది భక్తులు తరలి వెళ్లారు. రాధా చైతన్య సత్సంగ ఆశ్రమం లో భాగవత సప్తాహాన్ని బ్రహ్మశ్రీ పారువెళ్ళ ఫణి శర్మ ప్రవచించారు. శ్రీమత్ భాగవతంలోని ఘట్టాలను సోదాహరణలతో భక్తిరసంగా ఆయన ప్రవచించిన తీరు భక్తులను ఆకట్టుకున్నది. పరీక్షిత్తు మహారాజుకు శుక మహర్షి భాగవత సప్తాహాన్ని బోధించడం వల్ల శాపవిమోచనము పొంది పరీక్షిత్ మహారాజు మోక్షాన్ని పొందుతారు. ఇలా ముక్తిని పొందాలంటే సప్తహాన్ని వినాల్సి ఉంటుందని ప్రవచకులు పేర్కొన్నారు. ఈ కోవలో చాలామంది భక్తులు పుణ్యక్షేత్రాలలో జరిగే సప్తాహ కార్యక్రమంలో పాల్గొని తరిస్తుంటారు. అయోధ్య పట్టణంలో జరిగిన శ్రీ భాగవత సప్తాహం లో సహితం పెద్ద సంఖ్యలో భక్తుల పాల్గొని ఆలకించారు. వీరికి అన్ని ఏర్పాట్లను గట్టు గీత సమకూర్చారు. చివరి రోజున శ్రీకృష్ణుని కళ్యాణోత్సవంతో కార్యక్రమాలు ముగిసాయి. ఇలాంటి ఆధ్యాత్మికమైన భక్తి, ముక్తి ప్రదమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్న గట్టు గీతా దంపతులను పలువురు అభినందిస్తున్నారు.

మాచర్ల లో నేడు కృష్ణవేణి ఉ ఎస్వీఆర్ విద్యా సంస్థలలో జరుగనున్న..

ఉచిత కంటి పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షల శిబిరం



మాచర్ల పట్టణంలోని కృష్ణవేణి ఉ ఎస్వీఆర్ విద్యా సంస్థలు వారి ఆధ్వర్యంలో శ్రీ ధరియం ఆయుర్వేదిక్ ఐ క్లినిక్ మరియు పంచకర్మ సెంటర్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఉచిత కంటి మరియు ఇతర సమస్యలకు పరీక్షలు నిర్వహించబడును. ఈ పరీక్షలు నేడు అనగా 6.11.2026 శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4గం.ల వరకు జరుగును. ఈ శిబిరంలో కంటి చికిత్స లైన కంటి మచ్చల క్షీణత, ఆప్టిక్ న్యూరోపతి, కంటి నీటి కానులు, దూర దృష్టి లోపం, సమీప దృష్టి లోపం, నిరంతర పొడి కన్నుల కండ్ల కలలు మరియు సాధారణ చికిత్సలైన కీళ్ల వాతం, కీళ్లు క్షీణించడం, వెన్నెముక సంబంధిత సమస్యలు, జ్ఞాపకశక్తి సమస్యలు, వెన్ను నరాల నొప్పి, ఉబ్బిన నరాలు మొదలగు వాటికి చికిత్స చేయబడును. స్థలం.. ఎస్వీఆర్ డిగ్రీ కళాశాల, ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా, ఎమ్ జి ఎమ్ కాంప్లెక్స్, మాచర్ల. మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన సెల్ ఫోన్ నెంబర్లు.. 7034020977, 7034020877 .

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

సాంస్కృతికం
మన సంస్కృతి.. మన గర్వం..

11
శుక్రవారం నవంబర్ 06, 2026
www.trinetnews.com

బ్యారేజీలు.. భద్రం

నిపుణుల సూచనల మేరకే పునరుద్ధరణ పనులు
డిసెంబర్‌లో పనులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేయండి
దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా బిగువ గోదావరి జలాల సద్వినియోగం
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 5:

కేంద్ర ప్రభుత్వ సంస్థలు, డ్యామ్ సేఫ్టీ నిపుణుల సూచనల ప్రకారమే కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దెబ్బతిన్న మూడు బ్యారేజీలను సురక్షితంగా తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలపై మంత్రులు, నీటిపారుదల శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కాకుండా ప్రాజెక్టును కాపాడాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. మేడిగడ్డ వద్ద నీళ్లున్నా వాటిని లిఫ్ట్ చేయడం లేదనే తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని మంత్రులకు సూచించారు. అక్కడ కనిపించే నీటిని ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో సాంకేతికంగా లిఫ్ట్ చేయడం సాధ్యం కాదని నీటిపారుదల శాఖ ఇంజనీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మేడిగడ్డ నుంచి లిఫ్ట్ చేసిన నీళ్లు ఎల్లంపల్లికి చేరాలంటే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను మూసివేయాల్సి ఉంటుందని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నిర్మాణ లోపాలున్న అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను తెరిచే ఉంచాలని ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరించిన విషయాన్ని గుర్తుచేశారు. దిగువ గోదావరి నీరు వృథాగా పోకుండా దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా నీటిని లిఫ్ట్ చేసినట్లు ముఖ్యమంత్రి చెప్పారు. దీంతో ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఆయకట్టుకు సాగునీరు, తాగునీటిని అందించామన్నారు. గత ప్రభుత్వ హయాంలో దేవాదుల ద్వారా ఏడాదికి సగటున 9.57 టీఎంసీల నీటిని లిఫ్ట్



చేస్తే..ఈ మూడేండ్లలో సగటున 18.13 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసినట్లు చెప్పారు. గతంతో పోలిస్తే 89 శాతం అధికంగా గోదావరి నీటిని వాడుకున్నట్లు వివరించారు. అక్టోబర్? నాటికి దేవాదుల ద్వారా 16.71 టీఎంసీలు, సీతారామ ద్వారా 8.10 టీఎంసీలు లిఫ్ట్ చేసి 24.81 టీఎంసీల గోదావరి జలాలను సద్వినియోగం చేసుకున్నామని వివరించారు.

ఈ సమావేశంలో మూడు బ్యారేజీల పునరుద్ధరణకు రూపొందించిన ప్రణాళికను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు వివరించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో వ్యవసాయ విస్తీర్ణం పెరిగిందని, వరి దిగుబడిలో దేశంలోనే రికార్డు సాధించామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగానే మేడిగడ్డ కుంగిపోయిందని, బ్యారేజీల కుంగుబాటుకు దారితీసిన కారణాలను వివరించారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ప్రాణహిత ప్రాజెక్టును పూర్తి చేసి ఉంటే కరువు పరిస్థితుల్లోనూ ఇబ్బందులు ఉండేవి కావని, ప్రాణహిత నీటిని తక్కువ ఖర్చుతో ఎల్లంపల్లికి తీసుకువచ్చే అవకాశం ఉండేదని అన్నారు.

మూడు బ్యారేజీల పునరుద్ధరణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. బ్యారేజీల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. అవసరమైన అనుమతులను త్వరితగతిన పొందేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థలతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్న తర్వాత మూడు బ్యారేజీల పరిస్థితిపై ప్రభుత్వం సమగ్ర అధ్యయనం చేయించినట్లు అధికారులు వివరించారు. జాతీయ స్థాయి నిపుణులు, కేంద్ర ప్రభుత్వ సాంకేతిక సంస్థల సహకారంతో అవసరమైన పరిశోధనలు పూర్తి చేసినట్లు తెలిపారు. పునరుద్ధరణకు సంబంధించిన ప్రాథమిక ప్రణాళికలకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని వివరించారు. మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులకు దాదాపు రూ.4,193 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. నిర్మాణ లోపాలకు సంబంధించిన మరమ్మతుల వ్యయాన్ని నిర్మాణ సంస్థలే భరించేలా, అదనపు పనుల వ్యయాన్ని ప్రభుత్వం భరించేలా ప్రతిపాదించినట్లు వివరించారు. పనుల్లో జాప్యం జరగకుండా అన్ని ప్రక్రియలను సమాంతరంగా కొనసాగించాలని ముఖ్యమంత్రి సూచించారు.

పునరుద్ధరణ పనులకు సంబంధించిన తుది అనుమతులను ఈ నెలాఖరులోగా పొందేందుకు ప్రయత్నించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ఏడాది చివరిలోగా పనులు ప్రారంభించాలన్నారు. బ్యారేజీల నీటి వినియోగ సామర్థ్యాన్ని పునరుద్ధరించే పనులతో పాటు రక్షణ పనులను రెండు దశలుగా విభజించుకోవాలని చెప్పారు. బ్యారేజీల భద్రతకు సంబంధించిన ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, నిర్మాణ సంస్థల మధ్య సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, టన్నెల్స్ అండ్ సేఫ్టీ కార్యదర్శి కల్నల్ పరీక్షిత్ మెహ్రో, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంతరిక్ష వ్యర్థాల తొలగింపులో భారత్ ముందడుగు

2030 నాటికి వ్యర్థరహిత అంతరిక్షమే లక్ష్యం: కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్
హైదరాబాద్‌లో కాస్మోసర్వ్ స్పేస్ 'బేస్--1' కేంద్రం ప్రారంభం

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 5:

అంతరిక్ష వ్యర్థాల తొలగింపు సాంకేతికతల అభివృద్ధిలో భారత్ ప్రపంచస్థాయిలో ముందంజ వేస్తోందని కేంద్ర శాస్త్ర సాంకేతిక, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. 2030 నాటికి వ్యర్థరహిత అంతరిక్షాన్ని సాధించాలనే దార్శనికతను ప్రకటించారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని వీఎస్‌డీ టెక్‌పార్క్‌లో ఏర్పాటు చేసిన కాస్మోసర్వ్ స్పేస్ 'బేస్--1' కేంద్రాన్ని గురువారం న్యూఢిల్లీలోని కర్తవ్య భవన్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అంతరిక్షాన్ని సురక్షితంగా, సుస్థిరంగా ఉంచేందుకు భారత అంకుర సంస్థలు అభివృద్ధి చేస్తున్న సాంకేతికతలు కీలకపాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. క్రియాశీల అంతరిక్ష వ్యర్థాల తొలగింపు, కక్ష్యలో ఉపగ్రహాలకు సేవలందించే రంగాల్లో కాస్మోసర్వ్ స్పేస్ చేస్తున్న కృషిని అభినందించారు.సుమారు 14,800 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటైన బేస్--1 కేంద్రంలో అంతరిక్ష రోబోల రూపకల్పన, తయారీ, అంతరిక్ష పరిస్థితులను అనుకరించే పరీక్షలు, మిషన్ కంట్రోల్ ద్వారా నిర్వహణ చేపట్టనున్నట్లు తెలిపారు. కక్ష్యలో వస్తువులను సమీపించి పట్టుకునే



సాంకేతికతల ప్రయోగశాలలు, స్పేస్ రోబోటిక్స్ పరిశోధన విభాగాలు, సూక్ష్మ గురుత్వాకర్షణ అనుకరణ వేదికలు, ఉపగ్రహాల అనుసంధానానికి ప్రత్యేక క్లీన్‌రూమ్‌లు అందుబాటులో ఉన్నాయని వివరించారు.సంస్థ ఏర్పాటైన ఏడాదిలోపే 'మిషన్ ఎంబ్రేస్' ద్వారా 2026 జూలైలో మృదువైన రోబోటిక్ రేకుల సాంకేతికతను అంతరిక్షంలో పరీక్షించడం ప్రశంసనీయమన్నారు. ఇస్రో, గగన్‌యాన్ కార్యక్రమాల్లో పొందిన అనుభవాన్ని సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో డాక్టర్ చిరంజీవి ఫణీంద్ర బృందం ప్రైవేటు రంగంలో వినియోగిస్తోందని చెప్పారు. ఉపగ్రహ వ్యవస్థలు, ప్రొపల్షన్, ప్రయోగ సేవల కోసం ఇతర సంస్థలతో భాగస్వామ్యాలు సమగ్ర అంతరిక్ష మిషన్ల అభివృద్ధికి దోహదపడుతున్నాయని పేర్కొన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన అంతరిక్ష సంస్కరణలు దేశ యువత సామర్థ్యాలకు కొత్త అవకాశాలు కల్పించాయని జితేంద్ర సింగ్ అన్నారు. న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్, ఇన్--స్పేస్ వంటి సంస్థలతో అంతరిక్ష రంగ స్వరూపం మారిందన్నారు. భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ దాదాపు 9 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరిందని, వచ్చే దశాబ్దంలో 40--45 బిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని తెలిపారు. ఒక అంకె సంఖ్యలో ఉన్న అంతరిక్ష అంకుర సంస్థలు ప్రస్తుతం దాదాపు 450కి పెరిగాయని చెప్పారు.

అంతరిక్ష రంగంలో దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడులు మరింత పెరగాలని మంత్రి పిలుపునిచ్చారు. శాస్త్ర పరిశోధనలకు దాతృత్వ సహకారం, పరిశ్రమల భాగస్వామ్యం విస్తరించాలని సూచించారు. అంతర్జాతీయ సహకారంతోపాటు సాంకేతిక స్వావలంబన, స్వతంత్ర సామర్థ్యాల సాధన భారత ప్రధాన లక్ష్యాలని స్పష్టం చేశారు. చంద్రయాన్, గగన్‌యాన్ కార్యక్రమాలు తక్కువ వ్యయంతో సంక్లిష్ట మిషన్లను చేపట్టగల భారత సామర్థ్యాన్ని చాటుతున్నాయని పేర్కొన్నారు.

గతిశక్తి, స్మార్ట్ సిటీలు, విపత్తుల సన్నద్ధత వంటి రంగాల్లో అంతరిక్ష సాంకేతికత ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనాలు అందిస్తోందన్నారు. కాస్మోసర్వ్ చొరవ 'విశ్వబంధు భారత్' స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తోందని, దేశ సరిహద్దులకు అతీతంగా మానవాళికి సురక్షిత అంతరిక్ష వాతావరణాన్ని అందించేందుకు దోహదపడుతుందని చెప్పారు.

కార్యక్రమంలో తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గౌరవ అతిథిగా పాల్గొన్నారు. కాస్మోసర్వ్ స్పేస్ వ్యవస్థాపకుడు డాక్టర్ చిరంజీవి ఫణీంద్ర, సంస్థ బృందం హాజరయ్యారు. త్వరలో కేంద్రాన్ని ప్రత్యక్షంగా సందర్శించి శాస్త్రవేత్తలతో సంభాషించాలని ఆకాంక్షిస్తున్నట్లు జితేంద్ర సింగ్ తెలిపారు.

ఇంధన భద్రతకు బొగ్గు రంగ సంస్కరణలు వేగవంతం చేయాలి

బొగ్గు గ్యాసిఫికేషన్, ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
గోవాలో నాలుగో రాష్ట్రాల గనుల మంత్రుల సదస్సు

గోవా, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 5:

దేశ ఇంధన భద్రతను బలోపేతం చేసేందుకు బొగ్గు రంగ సంస్కరణలు, బొగ్గు గ్యాసిఫికేషన్, సాంకేతిక ఆధారిత తవ్వకాలను వేగవంతం చేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గోవాలో గురువారం ప్రారంభమైన నాలుగో రాష్ట్రాల గనుల మంత్రుల సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో చేపట్టిన సంస్కరణలు బొగ్గు, గనుల రంగాల్లో పారదర్శకత, సామర్థ్యం, వృత్తి నైపుణ్యాన్ని పెంచాయని పేర్కొన్నారు.దేశంలో సమృద్ధిగా ఉన్న బొగ్గు వనరులను సమర్థంగా వినియోగించుకునేందుకు గ్యాసిఫికేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని కిషన్‌రెడ్డి సూచించారు. బొగ్గును ఉపయోగకరమైన వాయువులుగా మార్చే ఈ ప్రక్రియతో దేశీయ బొగ్గు ఆర్థిక విలువ పెరగడంతోపాటు కొత్త పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని తెలిపారు. దీర్ఘకాలిక ఇంధన భద్రత సాధనలో ఇది కీలకపాత్ర పోషిస్తుందన్నారు.మారుతున్న అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ పరిస్థితుల్లో కీలక ఖనిజాలకు వ్యూహాత్మక ప్రాధాన్యం పెరిగిందని మంత్రి అన్నారు. దేశీయంగా ఖనిజ అన్వేషణ, తవ్వకాలు, ప్రాసెసింగ్, శుద్ధి, పునర్వినియోగ సామర్థ్యాలను బలోపేతం చేయాలని సూచించారు. స్వావలంబనతో కూడిన ఖనిజ వ్యవస్థను అభివృద్ధి చేయడం ద్వారా దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చని

చెప్పారు.ఖనిజ అన్వేషణ నుంచి గనుల నిర్వహణ, ఖనిజాల వెలికితీత వరకు కృత్రిమ మేధ, డిజిటలీకరణ, అధునాతన సాంకేతిక పరిష్కారాలను రాష్ట్రాలు వినియోగించాలని కోరారు. వీటితో ఉత్పాదకత, నిర్వహణ సామర్థ్యం పెరగడంతోపాటు సుస్థిర మైనింగ్‌కు మార్గం సుగమమవుతుందన్నారు. వేలం పూర్తయిన గనుల్లో కార్యకలాపాలను త్వరగా ప్రారంభించాలని, కొత్త బ్లాకుల వేలం, అన్వేషణ పనులను వేగవంతం చేయాలని సూచించారు.గనుల రంగ సంస్కరణలతో రాష్ట్రాలకు పెట్టుబడులు, ఆదాయం, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గనుల ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికీ ఇవి దోహదపడుతున్నాయన్నారు. సహకార సమాఖ్య స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తే దేశ ఖనిజ, బొగ్గు వనరుల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవచ్చని తెలిపారు.

ఉమ్మడి కార్యాచరణతో వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనకు గనుల రంగం కీలక తోడ్పాటు అందిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి సతీశ్ చంద్ర దూబే మాట్లాడుతూ.. ఆర్థిక ప్రగతి, పారిశ్రామికాభివృద్ధి, ఇంధన భద్రతకు గనుల రంగం ప్రధాన ఆధారమని అన్నారు. సుస్థిర, బాధ్యతాయుత తవ్వకాలు, పర్యావరణ పరిరక్షణ, గనుల పునరుద్ధరణ, స్థానిక ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గనుల కార్యకలాపాల ప్రారంభ దశలోనే మూసివేత అనంతర భూ పునరుద్ధరణ, స్థానికులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి ప్రణాళికలను రూపొందించాలని స్పష్టం చేశారు. సురక్షితమైన ఆధునిక తవ్వకాలతో బొగ్గు ఉత్పత్తిని పెంచుతూ, గ్యాసిఫికేషన్, బొగ్గు వినియోగంలో ఆవిష్కరణలు, ఫస్ట్ మైల్ కనెక్టివిటీని ప్రోత్సహించాలని కోరారు.కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్ మాట్లాడుతూ.. దేశీయ బొగ్గు ఉత్పత్తి వరుసగా రెండో ఏడాది వంద కోట్ల టన్నులను అధిగమించిందని తెలిపారు. ఇది ఇంధన స్వావలంబన దిశగా కీలక విజయమని పేర్కొన్నారు. వాణిజ్య బొగ్గు తవ్వకాలు, సవరించిన 'శక్తి' విధానం, 'కోల్ సేతు' వంటి కార్యక్రమాలతో ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంచడం, ప్రక్రియలను సరళీకరించడం, గనుల్లో ఉత్పత్తిని వేగంగా ప్రారంభించడం అవసరమన్నారు. బొగ్గు రంగం తదుపరి దశలో తవ్వకాలతోపాటు విలువ జోడింపు, పారిశ్రామిక విస్తరణపై దృష్టి పెట్టాలని సూచించారు.బొగ్గు శాఖ అదనపు కార్యదర్శి రూపిందర్ బ్రార్ ఇటీవలి సంస్కరణలు, వ్యాపార సౌలభ్యం, పెట్టుబడుల ప్రోత్సాహం, రాష్ట్రాల నుంచి అవసరమైన సహకారంపై ప్రజెంటేషన్ ఇచ్చారు. నవంబర్ 5, 6 తేదీల్లో కేంద్ర గనుల శాఖ నిర్వహిస్తున్న ఈ సదస్సులో వివిధ రాష్ట్రాల గనుల మంత్రులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు పాల్గొంటున్నారు. గనుల రంగ పురోగతి, అవకాశాలు, సవాళ్లు, ఉత్తమ విధానాలపై చర్చిస్తున్నారు.

రైల్వే శాఖ ఆధ్వర్యంలో వందేమాతరం ఉత్సవాల ముగింపు కార్యక్రమం

వ్యాసరచన, క్విజ్ విజేతలకు బహుమతులు ప్రదానం

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 5:

వందేమాతరం గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏడాది పొడవునా నిర్వహించిన ఉత్సవాల ముగింపు దశలో భాగంగా రైల్వే మంత్రిత్వ శాఖ గురువారం రైల్ భవన్‌లో సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించింది. రైల్వే బోర్డు చైర్మన్, సీఈవో సతీశ్ కుమార్, బోర్డు సభ్యులు, డైరెక్టర్ జనరళ్లు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.జాతీయ సమైక్యత, దేశభక్తి, భారత సాంస్కృతిక వారసత్వాన్ని చాటేలా ఈ వేడుకలను నాలుగు దశల్లో నిర్వహించారు. తొలి దశలో 2025 నవంబర్ 7న రైల్ భవన్‌లో వందేమాతరం సామూహిక గానాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.రెండో దశలో 2026 జనవరి 22న 'వందేమాతరం: భారత భిన్నత్వంలో ఏకత్వ స్ఫూర్తి' అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. జాతీయ గేయం ప్రాధాన్యం, సమైక్యత సందేశంపై తమ ఆలోచనలను వ్యక్తీకరించేందుకు ఈ పోటీ అవకాశం కల్పించింది.మూడో దశలో ఆగస్టు 10న వందేమాతరం 150 ఏళ్ల ప్రస్థానంపై క్విజ్ పోటీ నిర్వహించారు. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ నేతృత్వంలో రైల్ భవన్ ప్రాంగణంలో తిరంగా ర్యాలీ చేపట్టారు. రైల్వే బోర్డు చైర్మన్, ఉన్నతాధికారులు ర్యాలీలో పాల్గొన్నారు.నవంబర్ 1 నుంచి 7 వరకు జరుగుతున్న నాలుగో దశ ముగింపు వారోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వ్యాసరచన, క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు, ప్రతిభా ధ్రువపత్రాలు అందజేశారు. ఏడాది పొడవునా వివిధ కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణకు కృషి చేసిన రైల్వే బోర్డు సాంస్కృతిక బృందాన్ని కూడా బహుమతి, ప్రతిభా ధ్రువపత్రంతో సత్కరించారు.వందేమాతరం అందించే ఐక్యత, అంకితభావం, సమష్టి కృషి సందేశాన్ని ఈ వేడుకలు ప్రతిబింబించాయి. చిత్తశుద్ధి, నిజాయతీ, సమర్థతతో విధులు నిర్వహిస్తూ భారతీయ రైల్వేను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లాలన్న నిబద్ధతను అధికారులు పునరుద్ఘాటించారు.



నల్లగొండను 'సూపర్ స్మార్ట్ సిటీ'గా తీర్చిదిద్దడమే లక్ష్యం: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

రూ.2,000 కోట్లతో డబుల్ రోడ్ల విస్తరణ -- పేదలకు జీ+3 విధానంలో ఇందిరమ్మ ఇళ్లు -- ఏడాదిన్నరలో ప్రతి ఇంటికీ 24 గంటల తాగునీరు

నల్లగొండ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 5:



నల్లగొండ పట్టణాన్ని 'సూపర్ స్మార్ట్ సిటీ'గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. జిల్లాలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. జిల్లాలో సుమారు రూ.2,000 కోట్ల వ్యయంతో డబుల్ రోడ్ల విస్తరణ పనులు చేపడుతున్నామని, పేదలకు మెరుగైన నివాస సౌకర్యం కల్పించేందుకు జీం3 విధానంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. రాబోయే ఏడాదిన్నరలో ప్రతి ఇంటికీ 24 గంటల పాటు నిరంతర తాగునీరు అందించేలా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామని చెప్పారు.

ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువగా, వేగంగా అందించాలనే ఉద్దేశంతో నల్లగొండలో కీలక అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా రూ.17.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సమీకృత మండల కార్యాలయాల భవన సముదాయానికి, రూ.10 కోట్లతో మామిళ్లగూడ మీదుగా కతాల్‌గూడ--రాజీవ్ స్వగృహ రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సమీకృత మండల కార్యాలయాల భవన సముదాయం అందుబాటులోకి వస్తే ప్రజలకు వివిధ ప్రభుత్వ శాఖల సేవలు ఒకే చోట లభించడంతో పాటు పరిపాలన మరింత సులభతరం కానుంది. అలాగే రోడ్డు అభివృద్ధి పనులతో రవాణా సౌకర్యాలు మెరుగుపడి, ఆయా ప్రాంతాల ప్రజలకు ప్రయాణ సమయం తగ్గనుంది. నల్లగొండను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఆధునిక మౌలిక సదుపాయాలతో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. రహదారులు, తాగునీరు, గృహ నిర్మాణం, పరిపాలనా సౌకర్యాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనులు చేపడుతున్నామని తెలిపారు.

సమగ్ర అభివృద్ధి ద్వారా నల్లగొండ రూపురేఖలను మార్చడంతో పాటు ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

భారీగా పెరిగిన బంగారం ధర.. ఒక్క రోజే రూ.5వేలు పైకి..!

దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. అంతర్జాతీయ పరిణామాలు, డాలర్ విలువ పడిపోవడం తదితర కారణాలతో ఈ లోహాలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో అంతర్జాతీయంగా వీటి ధరలు పెరుగుతున్నాయి. ఆ ప్రభావంతో దేశీయంగానూ బంగారం, వెండి ధరలు దూసుకెళ్తున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మేలిమి 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి (+శీశ్రీఽ) ధర రూ.1.49లక్షలకు చేరింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.5వేలు పెరగడం గమనార్హం. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ.1.35లక్షలు పలికింది. అటు వెండి (గ్రాఅశ్రీజవతీ)పై ఇవాళ ఒక్కరోజే దాదాపు రూ.9వేలు పెరిగింది. నేటి మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2.04లక్షలకు చేరింది. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు ధర 4129 డాలర్లకు ఎగబాకింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు 100 డాలర్ల పైనే పెరగడం గమనార్హం. ఇక, ఔన్సు వెండి ధర 52.83 డాలర్లు పలికింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో డిసెంబరు డెలివరీ బంగారం 10 గ్రాములు రూ.1.45 లక్షలు పలుకుతుండగా.. కిలో వెండి రూ.1.89లక్షల వద్ద కొనసాగుతోంది.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సాంస్కృతికం

మన సంస్కృతి.. మన గర్వం..

12

శుక్రవారం నవంబర్ 06, 2026

www.trinetnews.com

గానసభలో గ్రంథావిష్కరణలు, సంగీత కార్యక్రమాలు ఉచితం :

- రచయితలు, కళాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి :

- త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళా జనార్థనమూర్తి వెల్లడి...



హైదరాబాద్ , చిక్కడపల్లి, ట్రైనెట్ న్యూస్, నవంబరు 5: గ్రంథ ఆవిష్కర ణలు, సాహితీ సమావేశాలు, శాస్త్రీయ సంగీత కార్యక్రమాలను ఇకపై త్యాగరాయగానసభనే ఉచితంగా నిర్వహిస్తుందని గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి తెలిపారు. ఈ మేరకు పాలకమండలిలో సంచలన నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. మంగళవారం చి క్కడపల్లిలోని త్యాగరాయగాన సభలో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. గతంలో వివిధ సంస్థల కు సాహితీ, శాస్త్రీయ సంగీత కా ర్యక్రమాలకు హాళ్లను ఉచితంగా ఇవ్వడం జరిగిందని గుర్తు చేశా రు. ఇకపై పుస్తకావిష్కరణ, శాస్త్రీ య సంగీత కార్యక్రమాలను తా మే స్వయంగా నిర్వహిస్తామన్నా రు. ఈ కార్యక్రమాలకు అయ్యే వ్యయం, బ్యానర్లు, ప్రచార ఖ ర్చులను కూడా గానసభనే భరి స్తుందని స్పష్టం చేశారు. రచయి తలు తమకు నచ్చిన అతిథుల ను ఎంచుకునే అవకాశం కల్పి స్తామని, వారు కోరిన సమయం లో అందుబాటులో ఉన్న హాల్ ను కేటా యిస్తామని తెలిపారు. రచయితలు, కళాకారులు ఈ వెసులుబాటును సద్వి నియోగం చేసుకోవాలని, త్యాగరాయ గాన సభ కార్యాలయంలో సంప్రదిం చాలని కోరారు. గానసభ పూర్వ అధ్యక్షుడు కళా సుబ్బారావు స్మృతికి నివాళిగా ఈ కార్యక్రమా ల ఖర్చులను భరిస్తూ నిర్వహిం చాలని నిర్ణయించినట్లు చెప్పా రు. గతంలో ఆయన పేరిట పేద లకు ఉచిత కళ్యాణ వేదికల పథ కాన్ని ప్రారంభించామని, గత మూడేళ్లుగా అది విజయవం తంగా అమలవుతోందని గుర్తు చేశారు. ఈ కా ర్యక్రమంలో కళా శారద దీక్షితులు, కళా రామచంద్ర మూర్తి, కళా మహాలక్ష్మి, ఎస్ వి. శ్రీనివాస్, కళా పద్మజ నీలిమ, తళ్ళ పల్లి చక్రపాణి, భమిడి ఉష, కళా లలిత, గుండవారపు గీతా దేవి,బండి శ్రీనివాస్, బండి నాగజ్యోతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మోత్కూర్ మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా కడమంచి సైదులు నియామకం



యాదాద్రి భువనగిరి, నవంబరు05/ట్రైనెట్ న్యూస్: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండలం గురువారం రోజు బీజేపీ మోత్కూర్ మండల పార్టీ ఆధ్వర్యంలో అనాజిపురం గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు కడమంచి సైదులును మోత్కూర్ మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా ప్రకటించడం జరిగింది.మండల పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ నియామక ప్రకటన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడియం రామచంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు జితేందర్ రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి కొంపెల్లి గణేష్,మండల బిజెపి పార్టీ అధ్యక్షులు గూదే మధుసుదన్ యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కడమంచి సైదులుకు నాయకులు శు భాకాంక్షలు తెలియజేశారు.

భారత సాంస్కృతిక వారసత్వానికి డిజిటల్ రూపం

గూగుల్ ఆర్ట్స్ అండ్ కల్చర్‌తో కేంద్ర సాంస్కృతిక శాఖ అవగాహన ఒప్పందం

భారతీయ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి చారిత్రక సంపద



న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 5: భారత సాంస్కృతిక వారసత్వాన్ని ఆధునిక డిజిటల్ సాంకేతికతతో పరిరక్షించి, ప్రజలకు చేరువ చేసేందుకు కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ కీలక ముందడుగు వేసింది. గూగుల్ ఆర్ట్స్ అండ్ కల్చర్‌తో గురువారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. వర్చువల్‌గా నిర్వహించిన కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ కార్యదర్శి వివేక్ అగర్వాల్, గూగుల్ ఆర్ట్స్ అండ్ కల్చర్ ఉపాధ్యక్షుడు, వ్యవస్థాపకుడు అమిత్ సూద్ సమక్షంలో ఒప్పందంపై సంతకాలు జరిగాయి.

ఈ భాగస్వామ్యం ద్వారా భారత పురావస్తు సర్వేక్షణ సంస్థ పరిరక్షణలోని స్మారక కట్టడాలు, పురావస్తు ప్రదేశాలు, వాటిలోని సేకరణలు, జాతీయ మ్యూజియంలలోని కళాఖండాలను డిజిటల్ రూపంలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ‘జ్ఞాన భారతం’ కార్యక్రమం కింద నమోదు చేస్తున్న ప్రాచీన లిఖిత ప్రతులతోపాటు హస్తకళలు, ప్రదర్శన కళలు, తరతరాలుగా కొనసాగుతున్న సజీవ సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

న్యూఢిల్లీలోని నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్ భవనాల్లో రూపుదిద్దుకుంటున్న ‘యుగే యుగీన్ భారత్ మ్యూజియం’ ఈ భాగస్వామ్యంలో ప్రధాన కేంద్రంగా నిలవనుంది. భారత చరిత్రను వివిధ యుగాల వారీగా పరిచయం చేయనున్న ఈ మ్యూజియం భవనాలు, అందులో ప్రదర్శించబోయే కళాఖండాల డిజిటలీకరణ ద్వారా శాశ్వత రికార్డును రూపొందించనున్నారు. మ్యూజియం రూపుదిద్దుకునే దశలోనే దాని విశేషాలను తెలుసుకునే అవకాశం ప్రజలకు కల్పించనున్నారు.

భారత వారసత్వాన్ని భారతీయ భాషల్లో, వివిధ డిజిటల్ పరికరాల ద్వారా తెలుసుకునేలా అందుబాటును విస్తరించడం ఈ ఒప్పందం లక్ష్యం. వారసత్వ పరిరక్షణ, ప్రజలకు చేరువ చేయడం, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు సాంస్కృతిక శాఖ పరిధిలోని సంస్థలు భాగస్వాములు కానున్నాయి.

ఈ సందర్భంగా వివేక్ అగర్వాల్ మాట్లాడుతూ.. భారత సాంస్కృతిక వారసత్వం ప్రతి పౌరుడికి చెందిన సజీవ సంపద అని పేర్కొన్నారు. ప్రాచీన లిఖిత ప్రతులు, చారిత్రక కట్టడాలు, జాతీయ మ్యూజియంల సేకరణలను నమోదు చేయడం, సంరక్షించడం, ప్రపంచానికి పరిచయం చేయడంలో ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని తెలిపారు. భారతీయ భాషల్లో ఈ సంపదను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మరింత మందిని భారత నాగరికత చరిత్రకు చేరువ చేయగలమని చెప్పారు.

అమిత్ సూద్ మాట్లాడుతూ.. గత 15 ఏళ్లుగా భారత కథన సంప్రదాయాలు, కళా నైపుణ్యం, విస్తృత వారసత్వం గూగుల్ ఆర్ట్స్ అండ్ కల్చర్‌కు స్ఫూర్తినిస్తున్నాయని తెలిపారు. ఆధునిక సాంకేతికతతో చారిత్రక సంపదను పరిరక్షించి, ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఉచితంగా తెలుసుకునేలా చేయడం ఉమ్మడి లక్ష్యమని పేర్కొన్నారు.

భారత పురావస్తు సర్వేక్షణ సంస్థ, నేషనల్ మ్యూజియం, నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడర్న్ ఆర్ట్‌తో గూగుల్ ఆర్ట్స్ అండ్ కల్చర్‌కు ఇప్పటికే దీర్ఘకాల అనుబంధం ఉంది. తాజా ఒప్పందం ద్వారా ఈ సహకారాన్ని విస్తరించి, భారత సాంస్కృతిక వైభవాన్ని దేశవిదేశాల్లో మరింత మందికి చేరువ చేయనున్నట్లు సాంస్కృతిక శాఖ తెలిపింది.

చేతులు కాలినాక ఆకులు పట్టుకున్నట్లు



చేయవలసిన సమయం దాటిపోయిన తరువాత లేదా జరుగకూడని నష్టం జరిగిపోయిన తర్వాత చేసే ప్రయత్నాలు వల్ల ఎటువంటి ఉపయోగం ఉండదు అని నిజాన్ని తెలియజేసే సామె తే”చేతులు కాలినాక ఆకులు పట్టుకోవడం”అన్నది. ఏ విషయంలోనైనా ముందు జాగ్రత్త అన్నది చాలా అవసరం. ఏ పని అయినా చెడిపోక ముందే ఆ పని మీద శ్రద్ధ ,జాగ్రత్త చాలా అవసరం. ఎందుకంటే సమయం అన్నది చాలా విలువైనది. ఒకసారి చేయి జారిపోయిన తర్వాత ఆ పనిని గాని ,ఆ కాలాన్ని గాని వెనక్కి తీసుకురాలేము.

అలాగే నిప్పు తాకి చేతులు పూర్తిగా కాలిపోయిన తరువాత ఆ మంటను చల్లార్చడానికి లేదా చేతులను రక్షించుకోవడానికి చెట్టు ఆకులను వెతుక్కుంటూ వెళ్లడం ఎంత అమాయకత్వమో జీవితంలో కూడా అవకాశం చేయి జారిపోయాక ప్రయత్నించటం అంతే వ్యర్థం.

ఈ సామెత వెనుక ఉన్న అర్థం ఏమిటంటే, పూర్వకాలంలో వంట చేసేటప్పుడు నిప్పుతో పని చేసేటప్పుడు అజాగ్రత్త వల్ల చేతులు కాలితే తక్షణ ఉపశమనం కోసం చల్లటి ఆకులను చేతులకు చుట్టుకునేవారు . అయితే చేతులు, కాళ్లకు ముందే ఆకులను రక్షణగా పట్టుకుంటే ప్రమాదము తప్పేది. కానీ చేతులు పూర్తిగా కాలిపోయి బొబ్బలెక్కిన తర్వాత ఆకులు పట్టుకుంటే నొప్పి తగ్గుతుందేమో కానీ కాలిన గాయం మాయం కాదు.

దీనికి ఇంకొక వివరణ కూడా ఉంది. అదేమిటంటే వెనక మసిగడ్డలు లేని రోజుల్లో వేడి గిన్నెలను కాలకుండా ఆకులతో దింపేవాళ్లు. అలా కాకుండా నేరుగా గిన్నెలు దింపితే కాలడం జరుగుతుంది. ఆ తర్వాత ఆకులు పట్టుకుని ప్రయోజనం లేదు.

ఇది నిజ జీవితంలో ఎలా వర్తిస్తుంది అంటే... చాలామంది విద్యార్థులు సంవత్సరం అంతా కాలక్షేపం చేసి, పరీక్షలు వచ్చినప్పుడు రాత్రంతా నిద్ర లేకుండా చదువుతారు. కానీ అప్పటికే సమయం మించి పోవడంతో పరీక్షలలో ఆశించిన మార్కులు రావు .ఫలితాలు వచ్చాక లబో దిబో మని ఏడుస్తారు. దీనికి ఈ సామెత వర్తిస్తుంది.

అలాగే చాలామంది ఆరోగ్యం బాగున్నప్పుడు చెత్త ఫుడ్ అంటే జంక్ ఫుడ్ తింటూ వ్యాయామం చేయకుండా నిర్లక్ష్యం చేస్తారు. అప్పుడు గుండె జబ్బు , మధుమేహము అంటే షుగర్ వచ్చాక డాక్టర్లు చుట్టూ తిరుగుతూ ,పత్యాలు పాటిస్తారు.

రోగం రాకముందే జాగ్రత్త పడకపోవడం వల్ల జరిగిన నష్టం ఏంటో అప్పుడు అర్థమవుతుంది.

అలాగే సంపాదన ఉన్నప్పుడు విచ్చలవిడిగా ఖర్చు చేసి అత్యవసర పరిస్థితుల్లో లేదా వృద్ధాప్యంలో డబ్బు లేక ఇబ్బంది పడి , అయ్యో ఉన్నప్పుడు పొదుపు చేయలేకపోయామే అని బాధపడతారు. అందుకే ఏదైనా సమస్య తీవ్ర రూపం దాల్చకముందే దానిని గుర్తించి పరిష్కరించుకోవాలి.

రేపు చూసుకుందాం అనే బద్ధకంతో, నిర్లక్ష్యంతో కాలం గడిపితే చివరకు చేతులు కాలినాక ఆకులు పట్టుకున్న పరిస్థితి ఎదురవుతుంది. ఇది కేవలం మనుషుల జీవితాల్లోనే కాదు.

ప్రభుత్వపరంగా చూస్తే ప్రతి సంవత్సరం వర్షాకాలంలో చాలా చోట్ల వరదలు వస్తూ ఉంటాయి.

. డ్రైనేజీ వ్యవస్థ ఎండాకాలంలో బాగు చేయకుండా వరదలు వచ్చి ఇల్లు మునిగిపోయాక అధికారులు పడవలు , హెలికాప్టర్లతో సహాయక చర్యలు చేపడుతూ ఉంటారు.

అంతేకాదు అడవులను నరికేస్తూ గాలిని , నీటిని కలుషితం చేస్తూ పోతున్నారు. గ్లోబల్ వార్మింగ్ పెరిగిపోయి , భూమి నివాసయోగ్యం కాకుండా పోతున్న తరుణంలో ఇప్పుడు పర్యావరణ దినోత్సవాలు, మొక్కలు నాటే ప్రయత్నాలు చేస్తున్నారు ఇది ముందే జాగ్రత్త పడి ఉంటే పర్యావరణం బాగుండేది.

జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. అందుకే ఆరోగ్య భీమా జీవిత బీమా లాంటివి కలిగి ఉండటం వల్ల విపత్కర పరిస్థితిలో కుటుంబాలు రోడ్డున పడకుండా ఉంటాయి.

కాలం గడిచిపోయాక విచారించటం కంటే కాలంతో పాటు నడవడం మంచిది. చేతులు కాల్చుకొని బాధపడే కంటే అసలు నిప్పుతో ఆడుకోకుండా ఉండటమే మంచిది. ప్రమాదాలు జరిగిన తర్వాత కన్నీళ్లు పెట్టుకోవడం కంటే అవి రాకుండా ముందే జాగ్రత్త పడటం మంచిది.

శుభోదయం..... శశి బాల

వేగవంతంగా యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మాణం పనులు : డిజిపి సి. వి. ఆనంద్



- వచ్చే విద్యా సంవత్సరం నుంచే పూర్తిస్థాయిలో అకడమిక్ బ్లాక్- x తరగతులు

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 05,ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపీఎస్) అకడమిక్ బ్లాక్–1 నిర్మాణ పనులను వేగవంతం చేసి, వచ్చే విద్యా సంవత్సరం నాటికి తరగతుల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని డిజిపి సి.వి. ఆనంద్ అధికారులను ఆదేశించారు. గురువారం మంచిరేవులలో పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు. పలు పనులకు అనుమతులు ఇస్తూ, ఇతర అంశాల పై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా అకడమిక్, మౌలిక సదుపాయాలు, సీఎస్ఆర్ , నియామకాలు, ఆర్థిక వ్యవహారాల కమిటీల పనితీరును సమీక్షించారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణ పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరాలకు అనుగుణంగా అవసరమైన మార్పులు, చేర్పులు చేపట్టాలని సూచించారు. నాణ్యమైన తరగతి గదులతోపాటు ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలకు క్రమశిక్షణ, కెరీర్ మార్గదర్శకత్వం ఎంతో అవసరమని డిజిపి పేర్కొన్నారు. మాదకద్రవ్యాల ప్రభావం లేని వాతావరణంలో విద్యాబోధన ప్రాముఖ్యత పెరుగుతున్న నేపథ్యంలో పోలీస్ స్కూల్ ప్రత్యేకతను చాటుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రమశిక్షణతో కూడిన విద్య, నాణ్యమైన బోధన, సరైన మార్గదర్శకత్వం ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించాలన్నారు. పోలీసు కుటుంబాల పిల్లలతోపాటు సాధారణ పౌరుల పిల్లలకూ అత్యున్నత ప్రమాణాలతో విద్య అందించే ఈ యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ కు భవిష్యత్తులో మంచి ఆదరణ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పాఠశాలలో 345 మంది విద్యార్థులు ఆరవ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారని అధికారులు వివరించారు. వచ్చే విద్యా సంవత్సరానికి సుమారు 720 మంది విద్యార్థులకు ప్రవేశాలు, మొత్తం 1000 మంది విద్యార్థులకు విద్య వసతులు కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిజిపి సూచించారు. సమావేశంలో డిజిపి సి. వి. ఆనంద్ తోపాటు శాంతిభద్రతల డిజి మహేష్ భగవత్, ఆక్టోపస్ డిజి అనిల్‌కుమార్, ఐ జి పి ఎల్ గజరావు భూపాల్, సిద్ధిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఏజి అడ్మిన్ రమణ కుమార్, డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, విశాల్ గోయల్ , ప్రిన్సిపల్ అనితారెడ్డి, జయకుమార్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136